# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము
గూడూరి వెంకట రత్నం
డి.జె. బాలకృష్ణ లాల్
డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి
మిస్. పి. ఇందిరాదేవి
డా॥ వి.వి. ఆర్ ప్రసాదరావు
డా॥ యమ్ స్వర్ణముఖి

VOLUME 31 ISSUE 9
No. OF PAGES 40
MAY 2012

5సం॥ల చందా రూ. 250
2సం॥ల చందా రూ. 120
సంవత్సర చందా రూ. 60
విడిప్రతి వెల...... రూ. 5
బ్యాంక్ డ్రాఫ్టు A/C Y.S.C.K.P.M
చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508

Pprinted and Published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

**ఈ సంచికలో** ............................. ...... **పేజీ**

| | |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| అమ్మ ఆశీస్సులు | 3 |
| బాబూజీ ఉవాచ | 4 |
| మాతాజీ అభిభాషణ | 6 |
| సన్నిధిలో సంభాషణ | 8 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 10 |
| భగవంతుడు కులాతీతుడు | 11 |
| గర్భిణీ స్త్రీలకు శుభవార్త ! | 12 |
| గురు కృపాహి కేవలమ్ | 13 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 15 |
| పరిప్రశ్నేన సేవయా | 18 |
| శివానందలహరి | 19 |
| మౌన ధ్యాన సప్తాహ శిబిరం | 22 |
| ఆశాఫలితం | 24 |
| సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర | 26 |
| హంస దృష్టి | 28 |
| అపరోక్షానుభూతి | 30 |
| నేను అర్థం చేసుకున్న ధ్యాన యోగం | 32 |
| తరణి | 34 |
| శ్రీరామ నవమి | 36 |
| విష్ణు కథలు | 38 |

# భద్రవాక్యం

– పరాశర ప్రసాద్

***మిత్ర భావేన సంప్రాప్తం నత్యజేయం కథంచన ।***
***దోషో యద్యపి తస్య స్యాత్ సతామే తదగర్హితమ్ ॥***

విభీషణుడు శ్రీరామచంద్రుని శరణాగతి పొందినప్పుడు అన్న మాటలు. మిత్రభావంతో చేరిన వాడిని విడిచిపెట్టను. వాడిలో దోషమున్నా సరే. సజ్జనులు దానిని లక్ష్య పెట్టకూడదు. వత్స అంటే దూడ. ఆవుకి తన దూడపై ఉండే ప్రేమనే వాత్సల్యం అంటారు. నలిగిన గడ్డిని కూడా తినటానికి యిష్టపడని గోవు అప్పుడే పుట్టిన తన దూడ దేహాన్ని శుభ్రపరచి మురికిని తొలగిస్తుంది. అదే వాత్సల్యం. అలాగే భగవానుడు తనని ఆశ్రయించి సేవించే భక్తుడిని అలాగే చేరదీస్తాడు. వాడిలో దోషాలను ఎన్నడూ చూడడు.

సంపూర్ణ శరణాగతి పొందిన తరువాత తాను ఏమి చేస్తున్నాను అనే ప్రశ్న ఉదయించదు. ఏమి చేసినా దానిని ఎలా సరిదిద్దాలో అది ఆయనకే చెల్లు. భగవంతుని ఆశ్రయిస్తే చాలు. చేరదీస్తాడు. ఇంతకాలానికి నాకీ జీవుడు లభించాడు అని సంతృప్తి పడతాడు. అంతవరకు ఎన్ని తప్పులు చేసినా "దాసుని తప్పులు దండంతో సరి" అన్నట్లుగా శరణాగతితో అన్ని సరిపెట్టుకుంటాడు.

ఇంత ఎందుకు? మన వేలికి ఉన్న డైమండ్ రింగ్ జారి బురదలో పడిందనుకుందాం. ఏం చేస్తాం? బురద అంటింది కనుక అక్కర్లేదని వదిలి వేస్తామా? ఆ బురద కడిగి వెంటనే తీసుకుంటాం. అది ఆశ్రిత వాత్సల్యం.

విభీషణుడు రావణుని సోదరుడే. రాక్షస వంశంలో జన్మించాడు. సీతమ్మవారిని అపహరించిన రావణాసురుని తమ్ముడే అయినా, శరణాగతిని పొందిన తరువాత అతనిలోని మాలిన్యము శ్రీరామచంద్రునికి గోచరించలేదు. అతనిని చేరదీసి ఆదరించి చివరికి ప్రభువుని చేశాడు. అది సద్గురుదేవులు వర్షించే ప్రేమ. దానికి సాటి ఇంకొకటి ఉందా!

పరాశర ప్రసాద్
గౌరవ సంపాదకుడు

# అమ్మ ఆశీస్సులు

**ప్రభుస్త్వం దీనానాం ఖలు పరమబంధుః పశుపతే
ప్రముఖ్యోహం తేషా మపి కిముత బంధుత్వ మనయోః
త్వయైవ క్షంతవ్యా శ్శివ! మపరాధా శ్చ సకలాః
ప్రయత్నా త్కర్తవ్యం మదవన మియం బంధు సరణిః ॥**

శ్రీశంకర భగవత్పాదాచార్యులవారు శివానందలహరిలో మనకందరికీ అందించిన మంచి స్ఫూర్తి.

హే పశుపతే! ప్రభువులలోకెల్ల గొప్పవాడివి నీవు. దీనులలోకెల్ల దీనుడను నేను. మనిద్దరి బంధుత్వము, యిప్పటిది కాదయ్యా ఎప్పటి నుంచో వస్తున్నదీ బాంధవ్యము. కనుక యీ దీనుడు ఎన్ని అపరాధములు చేసినా నీవు మాత్రము క్షమించక తప్పదు. మనిద్దరి బంధుత్వమును సమర్థించగల ఆత్మ బంధువు తానే.

శ్రీ ఆదిశంకరుల జయంతి వైశాఖ శుద్ధ పంచమి. (బృందావనమున) మన శ్రీసద్గురుదేవుల మూర్తి ప్రతిష్ఠ జరిగిన రోజు. రూప నామ గుణలీల సన్నిధిని ప్రసాదించిన శ్రీసద్గురుదేవులు కాళీప్రసాద దేవులు బృందావన స్థితులై ఉండి **సర్వమును కదలక నిలుచుండి కదిలింతువో జనుల** నీదే భారమని నమ్మిన జనులను ఉద్ధరించుటలో మిన్న అయిన శ్రీబాబూజీ మహరాజ్ అందరికీ బాబై, తండ్రియై, అందరికీ బాబులై, చంటివాడై నమ్మిన అందరికీ బాబూజీయై బాధలను బాపువాడై, ఆధివ్యాధులను హరించు సద్గురుదేవుడై ప్రకాశిస్తున్నారు.

అందరి హృదయ స్థితులై ముద్రవేసిన 'మీ హృదయ బాబు' అది శ్రీవారు అన్నమాట. మీలో మనస్సు బుద్ధి చిత్త అహంకారములను అంతఃకరణను పవిత్రత చేసుకుంటే సత్యం శాంతి దయ ప్రేమగా మారిన అంతఃకరణలో మీ హృదయబాబును దర్శించ గలరు. అట్టి శ్రీ సమర్థ సద్గురుదేవులు మనందరికి అట్టి భక్తి జ్ఞానములను సాధన సంపత్తిని ప్రసాదించు గాక!

సదా శ్రీసద్గురు సేవలో
మీ అమ్మ

# శ్రీ బాబూజీ ఉవాచ

(గతసంచిక తరువాయి) - వెంకట రమణ ప్రసాద్

***కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన ।***
***మా కర్మఫల హేతుర్భూః మాతే సంగోస్త్వకర్మణి ॥***



అన్నాడు శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీతలో. 'నీ విధిని నువ్వు నిర్వహించు. ఫలితాన్ని నాకు వదిలెయ్యి' అన్న పై మాటలే గీతా సందేశ సారాంశం. 'కర్మయోగం' అన్న పదానికి కూడా సూత్రప్రాయమైన నిర్వచనం అదే. కర్మయోగం ప్రతి మానవుడికి యీ క్రింద ఉదహరింపబడిన సూత్రాలను నిర్దేశిస్తున్నది -

1. 'సోమరితనాన్ని ఎన్నడూ నీ దరి చేరనియ్యకు. క్రియాశీలుడవై ఉండు. హృదయ దౌర్బల్యం క్షుద్రమైనది. దాన్ని త్యజించు' యుద్ధ రంగంలో అస్త్ర సన్న్యాసం చేసి చతికిలబడిన అర్జునుడికి స్వామి చేసిన ప్రబోధం ఇది.

2. నువ్వు ఏ వృత్తి చేపడతావో ఆ వృత్తిని అత్యద్భుతంగా నిర్వహించు. శ్రద్ధతోనూ, తత్పరతతోనూ శ్రమించు. నువ్వు శ్రమించేది కేవలం జీతపురాళ్ళ కోసమేగాక, భగవంతుణ్ణి చేరుకోవటానికి అదొక మార్గమని గుర్తించి శ్రమించు. పనిలో నేర్పు చూపించటమే యోగమంటే. ***యోగః కర్మ సుకౌశలం*** అని గుర్తుంచుకో.

3. నువ్వు భగవానుని ప్రతినిధిగా మాత్రమే వ్యవహరిస్తున్నావనీ, నీకు ఎప్పుడు ఏది యివ్వాలో ఆ భగవానుడికి తెలుసుననీ గ్రహించి, లభించినదానితో తృప్తిపడు. నీపని శ్రమించడమేగానీ, ఫలాన్ని ఆశించడం కాదని తెలుసుకో.

4. నీ శ్రేయస్సూ, కుటుంబ శ్రేయస్సూ ముఖ్యమైనవే. అయితే నీవూ నీ కుటుంబమూ నీ దేశంలోనూ, ప్రపంచంలోనూ భాగం కనుక సర్వులూ సుఖంగా ఉంటేగానీ, నువ్వు క్షేమంగా ఉండవని గుర్తుంచుకుని ***సర్వే జనా సుఖినో భవన్తు*** అనే లక్ష్యంతో జీవితాన్ని కొనసాగించు.

5. నీ విధి నిర్వహణలో ఎవరికీ కాస్త కూడ హాని కలుగనివ్వకు.

ఈ అయిదు సూత్రాలే కర్మయోగ సారాంశం. ఈ సూత్రాలను శ్రద్ధగా పాటించిన మానవుడు అత్యున్నత ఆధ్యాత్మిక శిఖరాలను అధిరోహించగలడు.

ఈనాటి పారిశ్రామిక రంగంలో అశాంతి, ఆందోళనలూ, సమ్మెలు, హర్తాళులు, బంద్‌లూ, లాకౌట్లు చాల అస్తవ్యస్త పరిస్థితిని సృష్టిస్తున్నాయి. అనేక పరిశ్రమలు మొదట తాత్కాలికంగానూ, తరువాత శాశ్వతంగానూ మూతపడుతున్నాయి. ఈ పరిస్థితులకు అత్యాశ, స్వార్థమూ, లుబ్ధత్వమూ కారణాలుగా కనిపిస్తాయి. ఒక వంక యాజమాన్యాలకు లాభాల దాహం తీరకుండా ఉంటే మరొక వంక పాలిత వర్గాలకు అధికాదాయంపై గల ఆశాపాశాలు అనంతంగా సాగిపోతూనే ఉన్నాయి. పెరిగిపోతున్న బాంక్ బాలన్సులు ఎలా యజమానులకు తృప్తినివ్వటం లేదో, పెరుగుతున్న వైయ్యక్తికాదాయం అలాగే కార్మికుడికి కూడ తృప్తినివ్వటంలేదు. ఎంత జీతం వచ్చినా కార్మికుడి ఆకలి తీరటం లేదు. ఫలితం పరస్పర ద్వేషం, ఈర్ష్య, విరోధం. దీనికంతటికి మూలకారణం మానవుడు కరుణామూర్తి అయిన భగవానుని విస్మరించటమే.

భగవంతుడు సర్వశక్తి సమన్వితుడు. ఆయన దయవలనే యీ సృష్టిలోని సమస్త చరాచరాలూ మనగల్గుతున్నాయి. ఆయన వ్యూహంలో భాగంగానే సృష్టి, స్థితి, లయములు సంభవిస్తున్నాయి.

మనకు విద్యుచ్ఛక్తి కొరత, వనరుల కొరత మొదలైనవన్నీ మనం భగవంతుణ్ణి మరచిపోవటం వలన వచ్చినవే. ఆయన సర్వ శక్తికీ, సర్వ సంపదలకూ మూలకందం. ఆయనను ఆశ్రయించిన వారికి లేమిలేదు. మనకు కష్టాలన్నీ భగవంతుడితో సంబంధాన్ని వదులుకోవటం వల్ల వస్తున్నవే.

అందుచేత మనం భగవంతుడి చరణారవిందాలను ఎట్టి పరిస్థితుల లోనూ విడిచిపెట్ట కూడదు. మన పనులన్నీ ఒకచేత్తో చక్కబెట్టుకుంటూ, మరొకచేతిని ఎల్లప్పుడూ ఆయన పాదాల మీద ఉంచాలి. ఎప్పుడు విశ్రాంతి లభిస్తుందో, అప్పుడు ఆ రెండవ చేతిని కూడ ఆయన పాదాల మీద ఉంచితే మనకు ఆయన నుండి శక్తిని ప్రవహిస్తుంది. మనం రీచార్జి చేయబడిన బ్యాటరీలా మళ్ళీ పుంజుకుని ఆనందోత్సాహాలతో పనిచేసే శక్తి ఆ భగవంతుడే యిస్తాడు. అలా భగవంతుణ్ణి నమ్మినప్పుడే మనకు శాంతి సౌఖ్యాలు లభిస్తాయి.

-సశేషం

(గత సంచిక తరువాయి)

# శ్రీ మాతాజీ అభిభాషణ

-జపమాల ప్రసాద

సృష్టిలో ప్రతీదీ ఉపయోగపడుతోంది కానీ ఈ మానవశరీరం ధరించి వచ్చిన మనం ఎంతమందికి ఎంతవరకూ ఉపయోగ పడుతున్నాం అని ఎవరిని వారు విమర్శించుకోవాలి. చెట్లు పళ్లని, పూవులని ఇస్తున్నాయి. ఉండడానికి నీడనిస్తున్నాయి. వాతావరుణ కాలుష్యాన్ని హరించడానికుపయోగ పడుతున్నాయి. చివరికి స్వార్థపరుడైన మానవుడు వాటిని నిర్దాక్షిణ్యంగా నరికి వేసినా, ఇంధనంగాను, ఇళ్ళు వగైరా కట్టుకోవడానికి, వంట చెరకుగాను, చలి తీర్చడానికి - ఇలా ఎన్నో విధాలుగా ఉపయోగపడుతున్నాయి. నదులు చూద్దామంటే సరేసరి. మన జీవనానికి కావలసిన నీటిని పుష్కలంగా ఇస్తున్నాయి. సృష్టిలో ఏది చూసినా ఇలా ఉపయోగపడుతున్నాయి. అవేవీ కూడా ప్రతిఫలం కోరటం లేదు. వాటన్నింటినీ స్వార్ధానికి వాడుకుంటున్నాడు మానవుడు. ఈ భూమి మీదవి చాలవన్నట్టు, ఇతర గ్రహాలకి కూడా వెళ్తున్నాడు. ఎందుకని? అక్కడ కూడా 'కాలనీలు' నిర్మించుకోడానికి! ఆహా! ఏమి స్వార్థం! ఇంతగా తాను ప్రేమిస్తున్న తన (మానవ) శరీరానికి ఏం విలువ వుంది? దీనికే గురుమహారాజ్ ఒక చక్కని కథ చెప్పేవారు.



ఒక దేశపు మహారాజుగారు మరణించారుట. ఆయన శవాన్ని చాలా చక్కగా అలంకారం చేసి, సమస్త రాజలాంఛనాలతోను, బాణసంచా పేలుస్తూ తీసుకువెళ్తున్నారు. ఇంతలో వర్షం మొదలయింది. 'అయ్యో! రాజుగారి శవం తడిసిపోతోందే' అని చుట్టూ వున్న మంత్రులు ఆ దారిలో ఒక పెద్ద చావిడిగల భవనం వుంటే దానిలోకి వెళ్ళి ఆ ఇంటి యజమానిని 'అయ్యా! మనదేశపు రాజుగారి శవం తడిసిపోతున్నది. కాస్త వర్షం తగ్గేంతవరకు, బయట వరండాలో పెట్టవచ్చా?' అని అడుగుతారు. ఆ ఇంటి యజమాని, 'చాలు చాల్లెండి. ఎంతటి దేశానికి మహారాజయినా, శవం శవమే. అశుచి కదా. ఇక్కడ పెట్టడానికి వీల్లేదు. కావాలంటే, మీ చెప్పులు వర్షానికి తడిసి పోతాయనుకుంటే, ఆ పంచన పెట్టుకోవచ్చు' అంటాడు! చూశారా! చెప్పుల పాటి చేయలేదు మానవ శరీరం!

జంతువుల శరీరాలు చచ్చిపోయినా, వాటి చర్మం చెప్పులు చేయడానికి పనికి వస్తోంది. మరి మానవ శరీరమో? ఈ సత్యాన్ని గుర్తించే, సాధుమహాత్ములు శరీరం పైన అభిమానం లేకుండా ఉన్నారు. భగవద్గీత ' భక్తియోగం'లో......

సమశ్శత్రౌచ మిత్రేచ। తథా మానావమానయోః
శీతోష్ణ సుఖద్ధుఖేషు। సమస్సంగ వివర్జితః॥ (12/18)
తుల్య నిందా స్తుతి ర్మౌనీ సంతుష్టో యేన కేనచిత్
అనికేతః స్థిరమతిః భక్తిమాన్మే ప్రియోనరః (12/19)

అనే వాక్యాలకి వారు నిర్వచన స్వరూపులయ్యారు. పైన చెప్పిన భక్త లక్షణాలన్నింటికీ కీలకం “అనికేతః” అనే పదం. ‘అనికేతః’ అంటే ఎడ్రస్సు లేనివాడు అని అర్థం. అంటే ‘ఈ దేహం నేను’ అనే ఎడ్రస్సు లేనివాడు. దేహాభిమానం లేనివాడు. స్థిరమతిః అంటే స్థిరమైన బుద్ధి కలిగిన వాడికే, ఈ భావం దృఢంగా, నిశ్చలంగా వుంటుంది. ‘దేహం నేను కాదు’ అనే భావన దృఢంగా వున్నవాడికి, శత్రువని లేడు, మిత్రుడని లేడు, మానావమానాలు లేవు, శీతోష్ణాలు లేవు, సుఖ దుఃఖాలు లేవు.

అటువంటి వారు, తమని ఎవరైనా నిందించినా, స్తుతించినా కూడా చలించరు. మననెవరైనా ఏదైనా అన్నాకూడా, దానిని మనం స్వీకరించలేదు అనుకోండి, అప్పుడా తిట్లు కూడా వాయుతరంగాలే కనుక, వాయువులోనే కలిసిపోతాయి. దేహాభిమానం ఉంటే ‘వాడునన్ను అన్నాడు’ అని ఏడుపువస్తోంది. ఏ టైముకి ఏది దొరికితే, దానితోనే తృప్తిపడతాడు నిజమైన భక్తుడు. పైన చెప్పిన గుణాలన్నీ ఏకనాథ స్వామిలో వుండబట్టేకదా, తనమీద అన్నిసార్లు ఉమ్మి వేసినా కూడా తొణకలేదు.

జ్ఞానదేవుడు, నామదేవుడు, తుకారాం, సక్కూబాయి, జానాబాయి, ఏకనాథుడు, సమర్థ రామదాస స్వామి, శివాజీ మహారాజు వంటి భక్తులు, జ్ఞానులు ఎందరెందరో ఉద్భవించిన పుణ్యభూమి ఈ మహారాష్ట్రము. ఆ మహాత్ముల పేర్లని ప్రతినిత్యం లేవగానే స్మరించాలి. తద్వారా వారి చరిత్రలని మననం చేసుకోవడం జరుగుతుంది. వారు నడచిన బాటలో, వారు నేర్పిన తీరున మనం నడుచుకోగలిగితే, వారు పొందిన దివ్యానందం మన సొత్తవుతుంది. అటువంటి సాధనా సంపత్తిని, అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యములను ప్రసాదించి గురుపాదుకలు సర్వదా మనందరినీ కాపాడుగాక! సుఖీభవ! సుఖీభవ!

హరిః ఓం తత్సత్

# సన్నిధిలో సంభాషణ

-పరాశర ప్రసాద్

16-6-1985

ఈ రోజు ఉదయం శ్రీబాబు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ మానవుడు ఎంత చదువుకున్నా తన జన్మ సార్థకమవ్వాలంటే సద్గురుమూర్తిని వెతుక్కోవాలి. శ్రీశంకర భగవత్పాదులవారు అటువంటి గురుమూర్తిని వెతుక్కున్నారు. ఆయనే శ్రీగోవిందపాదులవారు. గురుమూర్తిని నీ హృదయం లోనికి ఆహ్వానిస్తే ఆయన ప్రేమని జుర్రుకోకుండా అడ్డుగా ఉన్న సంకల్పములని కోరికల్ని ఆరగిస్తాడు. నిన్ను జనన మరణ విషవలయం నుంచి విముక్తుడిని చేస్తాడు. అంతేకాని మానవుడు అరణ్యంలోనికి వెళ్ళినంత మాత్రాన, సంసారాన్ని త్యజించినంత మాత్రాన సంకల్పాలను జయించ గలుగుతాడా? ఏమండీ! ప్రసాదరావుగారూ మీరు అలా భావించారా ఏమిటి? అన్నారు శ్రీబాబు.

ప్రసాదరావుగారు మాట్లాడుతూ సాధనకి భార్య పిల్లలు అవరోధంగా ఉంటే వారికి ఏ లోటు రాకుండా అన్ని ఏర్పాట్లు చేసి, సంసారాన్ని త్యజించ వచ్చునాండీ? అని ప్రశ్నించారు.

శ్రీబాబు మాట్లాడుతూ మీ సందేహ నివృత్తి కోసం ఒక దృష్టాంతం చెబుతాను. పూర్వం ఒక మహారాజు రాజభోగాలలో సుఖం లేదని, కీర్తి ప్రతిష్ఠలు శాశ్వతం కావని, సత్యము కావని, కీర్తి వ్యామోహం ఇంట్లో మార్బుల్‌మీద నాచు పడితే ఎంత ప్రమాదమో అంత ప్రమాదమైనదని వైరాగ్యం కలిగింది. వెంటనే విచారణ ప్రారంభించాడు. శాశ్వత సుఖాన్నిచ్చేది ఏది? అది తెలుసుకోవాలి అప్పుడు గాని నా జన్మకు సార్థకత ఉండదు. నా దేహం కూడా పరిణామం చెందుతోంది. ఈ శరీరం ఉండగానే దానిని తెలుసుకోవాలి. వృద్ధాప్యంలో కూర్చోవాలన్నా నిలుచోవాలన్నా కష్టం. ఏదో ఒక టైమ్‌లో కాలసర్పం మ్రింగేస్తుంది. అన్ని అవయవాలు బలంగా ఉన్నప్పుడే సర్వ ప్రకృతిని నడిపించే శక్తి ఏదో తెలుసుకోవాలి అనుకొని అర్ధరాత్రి ఎవరికి తెలియకుండా ఒంటరిగా తన భార్య, పిల్లలను, రాజ్యాన్ని వదలి అరణ్యానికి వెళ్ళి తన పూజకి, ధ్యానానికి, వంటకి అన్నిటికీ కలిపి ఉపయోగపడే విధంగా ఒక పర్ణశాలను నిర్మించుకున్నాడు.

మహారాణి భక్తురాలు. యోగవిద్య ద్వారా తన భర్త ఎక్కడకి వెళ్ళింది, ఎందుకు వెళ్ళింది తెలిసికొని ఇప్పుడు నేను ఏం చెప్పినా వినడు కాబట్టి

కొంతకాలం ఇలానే గడిచిపోనీ అని నిర్ణయించుకొన్నది. రాజ్య భారాన్ని తన మీద వేసుకుని చక్కని పరిపాలనను అందించినది. ఆ రాజ్యంలో ప్రజలు సుఖంగా, ఆనందంగా జీవిస్తున్నారు. ఇలా కొంతకాలం గడిచాక మహారాణి మారువేషంలో తన భర్త ఉన్న అరణ్యానికి వెళ్ళింది. ఇద్దరూ కుశల ప్రశ్నలు వేసుకొన్న తరువాత మహారాణి ఆయనను ప్రశ్నిస్తూ మీరు ఏ దేశానికి చెందిన వారు? మీ పూర్వాశ్రమ ధర్మం ఏమిటి? మీరు ఎందుకు సన్యసించారు? సన్యసించి శాంతిని ఎంతవరకు సాధించారు? అని అడిగింది.

ఆ మహారాజు సమాధానం చెబుతూ నాకు వైరాగ్యం కలిగింది. ధ్యానం చేస్తున్నాను. అంతా బాగానే ఉంది. కాని ఆ పరమాత్మని సందర్శించ లేకపోతున్నాను అన్నాడు. మహారాణి మాట్లాడుతూ తపస్సు కోసం నీ భార్యా పిల్లలను త్యజించి అరణ్యానికి వచ్చావు. కాని పూర్వాశ్రమంలో వాసనలుగాని, జన్మాంతర సంస్కారంలో వాసనలు గాని నీలో మరుగై ఉన్నాయి కదా! ఎంత సన్యసించినా అవి పోతేగాని వాసుదేవుడు నీలో ప్రకాశించడు కదా! నీ మనస్సు సన్యసిస్తే గాని పరమాత్మని దర్శించలేవు. ఆనందం దొరకదు. అప్పుడు గాని పూర్ణ స్థితిని పొందలేవు. అంతవరకు చతుర్దశిలోనే ఉంటావు. పరిపూర్ణ కాంతిని ఎలా అందుకో గలుగుతావు? వాసుదేవుని దర్శించాలంటే నీలో ఏ ఒక్క గుణం ఉన్నా అది సాధ్యపడదు కదా! కాలకూట విషం ఒక్క చుక్క అయినా చెడు చేస్తుంది. మజ్జిగ చుక్క ఎంత ఉన్నా పాలని విరిచేస్తుంది. వటబీజం చాలా సూక్ష్మమైనది. అది ఎంత చిన్నదైనా పెద్ద వటవృక్షాన్ని ఏర్పరుస్తుంది. అలాగే కర్మబీజం ఒక్కటి చాలు. అది తప్పక జన్మకి తీసుకు వస్తుంది. నువ్వు పరమాత్మని దర్శించాలంటే గురుదేవుడిని ఆశ్రయించు. ఆయన నీకు తరుణోపాయం చెబుతాడు అని వివరించి చెప్పి తన నిజ రూపాన్ని తెలిపేసరికి మహారాజు ఆశ్చర్యపోయాడు.

మహారాణి ఇంకా మాట్లాడుతూ మహారాజా! మీరు మానసికంగా సన్యసించాలి. రాజ్యపాలన చేస్తూనే సన్యసించవచ్చు అని హితవు చెప్పి మనస్సు ఎలా పవిత్రత చెందాలో నేర్పింది.......... మహారాజు మనస్సు పరమాత్మడి యందు నిలిచిపోయింది.

చూశారా! మానవుడు తరించాలంటే సన్యసించ నవసరం లేదు. సంసారంలో ఉండే తరించవచ్చు. అదే నిజమైన రాజయోగం అన్నారు శ్రీబాబు.

*

## శ్రీకాళీగార్డెన్స్‌లో విశేషపూజా కార్యక్రమములు

**మే 2012**

**6 ఆది** వైశాఖ గురు పూర్ణిమ, బుద్ధ జయంతి, శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన.

**10 గురు** శ్రీ మహాకాళికా పరమేశ్వరీ సహిత రామలింగేశ్వరస్వామి ఏకత్రింశత్ ప్రతిష్టా వార్షిక మహోత్సవము, రాత్రి 7 గం.లకు శ్రీ మహాకాళికా పరమేశ్వరీ రామలింగేశ్వర స్వామి వారి లీలా కళ్యాణ మహోత్సవము.

**15 మంగ** శ్రీగురుదశమి, హనుమత్ జయంతి, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

**19 శని** మాసశివరాత్రి.

**జూన్**

**2 శని** శని త్రయోదశి

**4 సోమ** పూర్ణిమ, శ్రీ సద్గురు పాదపూజ

**13 బుధ** శ్రీగురుదశమి, సత్సంగం,శ్రీ సద్గురు పాదపూజ.

**17 ఆది** మాస శివరాత్రి

**28 గురు** శ్రీ సుగుణప్రసాద మాతాజీవారి పంచమ వార్షిక పుణ్యారాధన.

**30 శని** తొలిఏకాదశి, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

అందరూ ఆహ్వానితులే!

U.K లో పూజ్య యోగిని శ్రీ చంద్రకాళీప్రసాద మాతాజీవారి సత్సంగ సమావేశములు

4-6-2012 నుండి 6-6-2012 వరకు జరుగును.

**READING HINDU TEMPLE, 112, WHITLEY STREET, READING RG 2 OEQ CONTACT NO. NAGESH - 079868 14971, SRINIVAS 79211 04572, RAMA KRISHNA - 07857 807414, KALI CHARAN - 07738 261771, PADMA - 07432 668694**

# భగవంతుడు కులాతీతుడు

(గత సంచిక తరువాయి)

– సుషుమ్న ప్రసాద

అది ప్రభువైన రంగనాధ స్వామి వాణియేనని గ్రహించి, ఆ ప్రధానార్చకుడు దుఃఖిస్తూ తాను చేసిన తప్పిదనాన్ని తెలియజేయమన్నాడు. 'నీవు తిరుప్పన్నారు అనే మహాభక్తుని నిందించి, అతనిపై రాయి విసిరావు. నీ దృష్టిలో అతను సంఘంలో అధమమైన పంచమకులానికి చెందినవాడని తిరస్కరించి, అతనిని దూరంగా తొలగిపొమ్మన్నావు. నేను వ్యక్తిలోని ప్రగాఢమైన భక్తికే ప్రాధాన్యమిస్తాను కాని, వాని పుట్టుకతో, కులంతో నిమిత్తం లేదు. కనుక వెంటనే నా ఆజ్ఞను శిరసావహించమని దివ్యవాణి ప్రబోధించింది.

వెంటనే లోకసారంగముని పూజారులందరితోనూ తిరుప్పన్నారు కోసమై వొరయు గ్రామానికి హుటాహుటిని తరలి వెళ్ళారు. ఆయన ఒక చిన్న కుటీరంలో ఉండటం గమనించి, ప్రధానాచార్యుడు ఆ మహాభక్తుని పాదాలపై పడి సాష్టాంగ నమస్కారం చేసి, స్వామివారి ఆదేశం తెలియజేశాడు.

గులకరాయి దెబ్బలతో దిగ్భ్రాంతిని చెందిన తిరుప్పనారు వారితో శ్రీరంగం వెళ్ళటానికి నిరాకరించాడు. "నేను అంటరానివాడను, నాకు శ్రీరంగం నేలపై అడుగు పెట్టటానికి కూడా అర్హత లేదు. నన్ను బలవంతం చేయవద్దు" అన్నాడు.

కాని ప్రధానాచార్యుడు అతని మాటలు పట్టించుకోకుండా "నీవు ఆ పవిత్ర ప్రదేశంలో అడుగు పెట్టలేనంటే నా భుజాలపై మోసుకుని తీసుకు వెళ్తాను. ఎందుకంటే నిన్ను దేవాలయమునకు తీసుకు వెళ్ళకుండ శ్రీరంగ నాధుని ముఖారవిందమును నేను తిలకించలేను" అంటూ లోకసారంగుడు తిరుప్పానాళ్వారును తన భుజాలపై యెక్కించుకున్నాడు. అప్పటి నుండి అతనికి **మునివాహన** అని మరొకపేరు వచ్చింది.

స్వామి సన్నిధికి చేరేటప్పటికి శ్రీరంగనాధ స్వామి దేవేరితో సహా ఆలయ ద్వారం వద్దనే వేచియుండటం చూసి ఆశ్చర్యచకితుడైనాడు. ఆదిదంపతుల దర్శనమైన ఆనందాతిశయముతో ఉప్పొంగిపోయి, తిరుప్పానాళ్వారు శ్రీరంగనాధ స్వామివారి జ్యోతిర్మయ స్వరూపాన్ని స్తుతిస్తూ, పది కీర్తనలను వ్రాశాడు. చివరి కీర్తన ఎలా ముగించాడంటే "ప్రభువును

దర్శించిన యీ పునీత నేత్రములతో యితర రూపములను చూడ నిచ్ఛ లేద''న్నాడు. తిరుప్పానారు యొక్క నిష్కళంక భక్తికి మెచ్చి, శ్రీరంగనాధ స్వామి ఆళ్వారును తనలో లయం చేసుకొన్నాడు.

తిరుప్పానాళ్వారు స్తుతించిన ఆ పది మధురగీతాలు, ద్వాదశ ఆళ్వారులు గానము చేసిన '**దివ్య ప్రబంధము**'లోని నాలుగు వందల పవిత్ర పద్యములలో చోటు చేసుకున్నవి. ఆ ఘనత తిరుప్పానాళ్వారుకు లభించినది.

## గర్భిణీ స్త్రీలకు శుభవార్త!

శ్రీశ్రీశ్రీ సమర్థ సద్గురు హనుమత్కాళీ వర ప్రసాదబాబూజీ ట్రస్ట్ హాస్పిటల్ శ్రీకాళీగార్డన్స్ నంబూరులో, సద్గురుదేవుల దివ్య ఆశీస్సులతో పూజ్యమాతాజీ **ఉచిత ప్రసూతి వైద్యసేవలను** అక్టోబర్ 2011 నుంచి అందిస్తున్నారు. ప్రసూతి పరీక్షలు, అవసరమైన మందులు, ఆపరేషన్ ఖర్చులు, సాధారణ డెలివరీ ఖర్చులు మొ॥గు సర్వవిధమైన ఖర్చులను ఉచితంగా అందించి, తల్లీ బిడ్డ క్షేమంగా యింటికి తరలించేవరకు ట్రస్టు ఆసుపత్రివారే భరిస్తారు. ఇంతవరకు 12 సిజేరియన్ ఆపరేషన్లు, 56 సాధారణ ప్రసవములు వుచితంగా జరిపించారు. బయట ఎంతో వ్యయంతో కూడుకుని ఉన్న ఈ కార్యక్రమాన్ని ట్రస్ట్ హాస్పిటల్ ఉచితంగా అందిస్తోంది. కాబట్టి ఈ సదావకాశాన్ని గర్భిణీస్త్రీలు ఉపయోగించుకో వలసినదిగా తెలియ జేస్తున్నాము.

ఒక సాధారణ ప్రసవానికి 5,000రూ॥లు, సిజేరియన్‌కి 10,000 రూ॥లు ఖర్చు అవుతుంది. దాతలు 5,000రూ॥లు యిస్తే వారి పేరున ఒక సాధారణ ప్రసవము, 10,000 రూ॥లు యిస్తే వారి పేరున ఒక సిజేరియన్ జరుపబడును. 50,000 రూ॥లు యిస్తే వారిపేరున ప్రతి సంవత్సరం ఒక వుచిత ప్రసవం జరుపబడును.

వివాహాది శుభ కార్యములలో దాతలు తాము యివ్వదలచిన బహుమతిని విరాళంగా వారిపేరున ట్రస్ట్ హాస్పిటల్‌కు యివ్వవచ్చును.

దాతలు ఉదారహృదయంతో ముందుకు వచ్చి తమ చేయూతనిచ్చి ట్రస్ట్ హాస్పిటల్‌వారు తలపెట్టిన యీ ఉచిత సేవాకార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగేటట్లు చేస్తారని ఆశిస్తున్నాము.

- ట్రస్ట్ హాస్పిటల్

# గురు కృపాహి కేవలమ్

సేకరణ-రమణ ప్రసాద్

శ్రీగురుదేవులు 1966 మే లో సంపూర్ణ ఉత్తరదేశ యాత్ర భక్తులందరితో కలసి చేయాలని సంకల్పించారు. చంద్ర (శ్రీమాతాజీ) తాను కూడా వస్తాననే కోరికను వ్యక్తం చేసింది. శ్రీబాబు అంగీకరించారు. అందుకోసం రాఘవమ్మగారిని (చంద్ర తల్లిని), అమ్మన్నగారిని (నాయనమ్మ) కూడా బయల్దేరమని చెప్పారు.

శ్రీబాబు భక్తులందరితో కలసి హృషీకేశ్ చేరారు. అందరూ ప్లాట్‌ఫారం మీద భోజనాలు చేస్తూండగా, బాగా గడ్డం పెరిగి, వికృతాకారంగా ఉన్న ఒక వ్యక్తిని చూసి చంద్ర 'బాబూ!' పెద్ద కేకపెట్టి మూర్ఛ పోయింది. యాత్రలో వస్తున్న నిండ్రకొలను డాక్టరుగారు చంద్రను పరీక్ష చేశారు. ఇంజక్షను యిద్దామని ప్రయత్నిస్తే ఎక్కలేదు. డాక్టరుగారు శ్రీబాబుతో "పరిస్థితి చేయి దాటిపోయింది. ఆశ ఏమీలేదు. ఇక గురుకృప మాత్రమే శరణ్యము" అని చెప్పి తన బోగీలోకి వెళ్ళిపోయారు.

శ్రీబాబు చంద్ర తలపై తన చేయి ఉంచి యోగసమాధి నిష్ఠులైనారు. ఒక గంట గడిచిన తరువాత అచేతనంగా ఉన్న చంద్రలో కొంచెం కదలిక వచ్చింది. కళ్ళు తెరచి చూసి 'బాబూ!' అంటూ చేతులు చాపింది. శ్రీబాబు చంద్రను చేతులలోకి తీసుకుని వెన్ను తడుతూ, రాఘవమ్మగారిని పిలిచారు. ఆమె రాగానే చంద్రను ఆమె చేతిలో పెట్టి, "అమ్మా! ఇదిగో! నీ బిడ్డను సురక్షితంగా నీ చేతిలో పెడుతున్నాను. డాక్టరుగారు 'ఏమీ ఆశ లేదు అంతా అయిపోయింది అనేసరికి' 'నా ఒక్కగాన ఒక్కబిడ్డను నాకు కాకుండా చేస్తారా?' అని నిందవేస్తావేమో అని నా గుండె టకా టకా కొట్టుకుంది. కాని కరుణామూర్తి అయిన జగన్మాత ఆ నింద రాకుండా నీ బిడ్డను పునర్జీవితురాలిని చేసింది" అన్నారు.

రాఘవమ్మగారు ఆనంద బాష్పాలతో శ్రీగురుచరణాలను అభిషేకిస్తూ 'ఆ జగన్మాత ఎవరో మాకు తెలియదు కాని, మాకు మీరే అన్నీ. గురుదేవులు, బందువు, మిత్రులు, సర్వస్వమూ తమరే **అన్యధా శరణం నాస్తి త్వమేవ సర్వం మమ**' అన్నారు. "తథాస్తు" అన్నారు శ్రీబాబు.

శ్రీమాతాజీ కృతజ్ఞతా భావంతో ఎన్నోసార్లు యీ సంఘటనను గూర్చి తమి అభిభాషణలలో యిలా చెబుతూ ఉంటారు. "అప్పుడు నా ఒళ్ళు చల్లబడిపోయింది. శ్రీబాబు నన్ను ఒళ్ళో పడుకోబెట్టుకుని తమ చేతిని నా తలపై ఉంచి ధ్యానముద్రలోకి వెళ్ళిపోయారు. కొంతసేపటికి నాకు స్పృహ వచ్చి 'బాబూ!' అంటూ ఆయన చేతులలో వాలిపోయాను.

నన్ను చూసి 'ఏమీ ఆశ లేదు' అని డాక్టరుగారు చెప్పారు. మరి నన్ను రక్షించింది ఎవరు? శ్రీగురుదేవులే నన్ను రక్షించారు. గురుకృప నన్ను రక్షించింది.

ఉత్తర దేశ యాత్రలో కాశీ క్షేత్రంలోనూ, బదరీలోనూ శ్రీబాబు తమ దివ్య దర్శనాన్ని చంద్రకు ప్రసాదించారు. శ్రీబాబు అఖండ తేజో మూర్తిగా యోగసమాధి నిష్ఠులై కనిపించారు. చంద్ర తాను కూడా కనులు మూసుకుని ధ్యాన నిమగ్నురాలైంది. తాను కూడా అఖండ తేజోరాశిగా ప్రకాశిస్తున్నట్లుగా అనుభూతి కలిగి, ఆ అనుభూతిలో మైమరచిపోయి ఉండిపోయింది.

శ్రీబాబు చంద్రను "ఎలా ఉంది?" అని ప్రశ్నించారు.

'చెప్పలేనంత ఆనందంగా ఉంది బాబూ' అని చెప్పింది.

శ్రీబాబు "నీ స్వస్వరూపమూ, స్వానుభవమూ నీకు రుచి చూపించాను. ముందు ముందు ఎన్నెన్నో దివ్యానుభవాలు నీకు కలుగుతాయి" అని ఆశీర్వదించారు.

శ్రీమాతాజీ రూపంలో శ్రీగురుదేవులే మూర్తీభవించి ఉన్నారు అని అశేషభక్త జనావాళి అనుభవపూర్వకంగా శ్రీబాబూజీని శ్రీమాతాజీలో దర్శించుకుంటున్నారు.

*

> *నా దివ్య కృప నీ మార్గమును ప్రకాశమొనరుస్తుంది. నా దివ్యశక్తి ఘనము ప్రశస్తము. నిస్వార్థములగు కార్యములను చేయుటకై నిన్ను ప్రోత్సహిస్తుంది. నా దివ్యానుగ్రహము నిన్నొక దివ్య విగ్రహముగా పరివర్తనము గావిస్తుంది.*
>
> *- స్వామి రామదాస*

(గత సంచిక తరువాయి)

# శ్రీకృష్ణకర్ణామృతం

-సుశీలా ప్రసాద

నాలుగోరోజు ఉదయం ఏదో పనిమీద అటూ యిటూ వెడుతున్న అక్కని చూస్తూ ఆగలేక చెయ్యిపట్టుకుని ఆపి అడిగాను మెల్లిగా "రాత్రి ఎక్కడికి?....." అని. నోటిమీద వేలుంచి చెయ్యి విదిలించుకుని వెళ్ళిపోయింది. ఇదంతా ఏమిటి మాయా! ఇంద్రజాలమా? అక్క ఏదిశలో పయనిస్తోంది? ఆలోచించి, ఆలోచించి అలసిపోయి ఉన్నానేమో, పెంద్రాడే నిద్రపోయాను. సమయం ఎంత అయిందో తెలియదు. అక్క నన్ను తట్టి లేపుతోంది. గాఢ నిద్రలోంచి లేచినందువలన యింకా మత్తుగానే ఉంది. చెయ్యి గట్టిగా పట్టుకుని నడిపిస్తున్న అక్క వెనకే అడుగులు తడబడుతుంటే నడుస్తున్నాను. ఒక చోట ఆపి, "కళ్ళు తెరు! ఎదుట చూడు" అంది.

లీలగా మొదట కనిపించినా అక్క చూపించిన ఆ మూర్తిని సగం తెరచిన కళ్ళతో చూసి ఆపైన బాగా కళ్ళు విప్పి చూశాను. కలువరేకులాంటి కళ్ళు చూశాను. ఆ తరువాత నీలి మబ్బులాంటి ఒళ్ళు చూశాను. ఇంకా పాలుగారు చెక్కిళ్ళు యింకేముంది? తొలిచూపుకే సంకెళ్ళు! కన్నార్పక చూస్తున్న కొద్దీ యింకా యింకా చూడాలనిపించే ఆ ముగ్ధ కిశోర మనోహర రూపం! చుట్టూ అందర్నీ చూశాను. ఇంత పసివాని కోసమా యీ వయస్సుకత్తెలు అందరూ ప్రపంచ పరిధి నతిక్రమించి సంచరిస్తున్నారు! అలాగ ఎంతసేపు ఉండిపోయానో! మై మరచిపోయిన నన్ను జాగ్రదవస్థలోకి తెచ్చింది శ్రావ్యమైన మురళీగానం' చూడగా అరవిందాల వంటి వాని చేతులలో ఎట్టుని పెదవులపై నిలిపిన పిల్లన గ్రోవి కనిపించింది. ఇతడు శిశువేమీ కాదు! సృష్టిని శాసించే సర్వాధికారి అని తానిచ్చిన తెలివితోనే నాకు బోధపడింది. ఎందుకంటే కనిపించే వనితలంతా జ్ఞానమూర్తులే. కనుకనే వాని కోసం తమ సర్వం త్యాగం చేసినందు వలన బ్రహ్మానందం పొందుతున్నారు. మరి నేను మాత్రం వారికేమీ తీసిపోనే!

ఇన్నాళ్ళూ నాది అనుకుని యిష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్న నా మనస్సుని ఆ ముద్దుపాదాల మీద ఆ క్షణమే పడేసి "ఇదిగో! యిది నీ సొమ్ము. నీవే భద్రం చేసుకో" అన్నాను. మురళీలోలుని దివ్య నయనాలలో ప్రేమానురాగాల కాంతులు నిండి "అలాగే!" అని నాకు వాగ్దానం చేసినట్లుగా మెరుస్తూ కనిపించాయి. తెల్లవారుతూనే ఎవరూ చూడకుండ అక్కని గట్టిగా

కౌగలించుకుని 'ఇంతకీ పేరడగటం మర్చిపోయాను' అన్నాను. పిచ్చి మొద్దు! 'కన్నయ్య!' అంది తియ్యగా నవ్వుతూ అక్క. అదే నాకు తారకనామ మైందినాకు.

బలవంతాన మధురకు తిరిగి వెళ్ళాక నేను చెప్పిన మాటవిని అమ్మ, నాన్న నిశ్చేష్టులయ్యారు. "ఎందరో అందగాళ్ళు, ఆస్తిపరులు నిన్ను చేసుకుంటామని ముందుకి వస్తుంటే అందర్నీ కాదన్న నువ్వు, మానాన్న మాట కాదనలేక మా చెల్లెలి కొడుక్కి మీ అక్కనిచ్చి చేస్తే దాన్ని అన్యాయంగా ఆ పల్లెటూళ్లో పడేశారని మమ్మల్ని దుయ్యబట్టిన నువ్వు, ఇప్పుడా పల్లెటూరులోనే ఉన్న చదువులేని సన్నాసిని అక్క మరిదిని చేకుకుంటానని మొండితనం చేస్తున్నావేమిటే!" అని నాన్న తిట్లు సాగించారు. ఎవరెంత చెప్పినా, ఎవరే మనుకున్నా గాని నా నిర్ణయం మార్చుకోలేను.

నాకేమో అక్కడ బంగారు నిధి కనిపించింది. వీళ్ళేమో కొద్ది కాసుల మూటని, వరాల సంచిని నాకిస్తానంటున్నారు. తెలివితక్కువ వాళ్ళు అనుకుని గట్టిగా పట్టుపట్టాను. చివరికి నామాట అంగీకరించక తప్పలేదు. పెద్దవాళ్ళంతా తిడుతూ దీవిస్తూ పెళ్ళి జరిపించారు. అలాగ యీ సాటిలేని మేటి వ్రజభూమికి కోడలినై వచ్చి అక్కని మీ అందరిని ఆదర్శంగా పెట్టుకుని రోజంతా యింట్లో వారికి సేవ చేసుకుంటూ వారిలో మురళీధరుణ్ణి చూసుకుంటూ అది రాత్రిగా, శ్యామ సుందరుని దర్శించే యీ శోభాయమానమైన వెలుగులు నిండిన పగలుగా గడుపుతూ బ్రహ్మానందంలో ఓలలాడుతున్న భాగ్యశాలిని నేను".

ఆమాటలు ముగిసేలోగా వారికి శ్రీచందనము తులసి పరిమళాలు వచ్చి నాసాపుటలని తాకి మహదానందంలో ముంచాయి. ' అదిగో ! ప్రభువు యీ దాపునే ఉన్నాడని మనకీ సువాసనలు తెలియజేస్తున్నాయి. రండి! వెదకి చూద్దాం' అని అందరూ అటూ యిటూ తిరుగుతుంటే వారివెనకగానే ఉన్న మాలతీ తీగెల చెంత మెత్తని పూలశయ్యపై పరున్న గోకులనాధుడు కనిపించాడు. అంతవరకూ గోపకామినుల తీయని మాటలు వింటూ పెదవులు దాటిపైకి వచ్చే చిరునవ్వును కొంచెం ఆపుకుంటూ వారి గాఢమైన విశ్వాసము భక్తి నిండిన మధుర వాక్యాలు వింటూ అనురాగ మూర్తి అయినందున శరీరం అంతా రోమాంచనము కాగా వేడుకగా కళ్ళు మూసుకుని నిద్ర నటిస్తున్న శ్రీకృష్ణుని చూస్తూ గోపీ రమణులు పరవశలై "దొంగనిద్ర నటిస్తున్న నీవెప్పుడు వచ్చావయ్యా?" అని ఆనందంగా పలకరించారు.

గోకుల భూమికి మహదైశ్వర్యమైన నల్లనయ్య "మీరంతా నా మాటలు

చెప్పుకుంటున్నప్పుడే!" అని బదులు పలికి అప్పటిదాక ముచ్చటించిన గోపికతో "ఆనాడు నువ్వు తొలిసారిగా నా దరికి వద్దామనుకుంటే నీ మనస్సులోని శంక నిన్ను సర్పమై నిలబెట్టేసింది. తరువాత కానవచ్చిన దివ్య తేజస్సు చూసేందుకు, అందులో ప్రవేశించేందుకు నీకు తగిన జ్ఞాన నేత్రం లేదు. అప్పుడు మీ అక్క నా ప్రతినిధిగా నీకు గురుమూర్తి అయి, నీ చేతిని పట్టి నడిపించి తెచ్చి పరమాత్మనైన నన్ను చూపించింది.

నీ యెడల దయా దృష్టి కలిగిన నేను నీ కిచ్చిన జ్ఞానంతో నా తత్త్వాన్ని గ్రహించి నా సన్నిధిలో నిలిచిపోగలిగావు. సర్వ సమర్పణ చేసుకున్న సత్యసాధకుని స్వీకరించిన సమర్థ సద్గురు రూపమే అయిన సర్వాంతర్యామి, సర్వేశ్వరుడు, సర్వశక్తిసంపన్నుడు యిక ఎన్నడూ దానిని వదలడు. ఇది నా ప్రతిజ్ఞ! నా అభయం!" సర్వ జగత్తులో వ్యాపించి ఉన్న అఖండ చైతన్య స్వరూపుని దివ్యవాణిని వినగల వీనుల మహద్భాగ్యం అనంత రూపాన్ని కనగలిగిన నయనాల వైభవం వర్ణనాతీతం.

**శ్లోక తాత్పర్యం -**

*గోప కామినుల విలాస భాషితం వినగోరి, ఊరికే కనులు మూసుకుని ఉండి, లోనుండి వస్తున్న నవ్వును ఆపుకోలేక పెదవులు కొంచెంగా విడివడుతుంటే భక్తులైన వ్రజభానులందరి ప్రేమ వలన శరీరం పులకరించగా కల్లనిద్ర అభినయించే శ్రీకృష్ణుని ధ్యానిస్తున్నాను.*


అందరూ ఆహ్వానితులే!

త్రయాహ్నిక దీక్ష

అమెరికాలో పూజ్య యోగిని శ్రీచంద్రకాళీ ప్రసాద మాతాజీవారిచే 26-5-2012 నుండి 28-5-2012 వరకు సత్సంగ సమావేశాలు జరుగుతాయి.

**VENUE - GALI SRIKANTH, 103, STANZA COURT, CARY, NC 27519.**
**PH.NO.** -919 481 3731

## పరిప్రశ్నేన సేవయా

-పరాశర ప్రసాద్

అంత్యకాలమందు మనస్సు ఎలా ఉంటుంది? అని సందేహము లేవనెత్తిన భక్తునికి సమాధానంగా బోధ చేస్తూ సద్గురుదేవులు "ఇప్పుడు నీ మనస్సు ఎలా ఉంది? సంసార సాగరంలో కూరుకుపోయి ఉందా? సంకల్పాలకు, కోరికలకు దాసోహం చేస్తోందా? మరి అంత్యకాలంలో ఏదైన కోరిక మిగిలి వుంటే దానికి సంబంధించిన పంజరముతో కూడిన జన్మ తప్పదు కదా! గురుస్మరణ మరచి, మనస్సు సంకల్పానికి దాస్యం చేస్తే మరణము తప్పదు కదా! స్మరణ మరవటమే మరణానికి కారణము.

సద్గురుమూర్తిని ఆశ్రయించి, ఆయన ప్రసాదించిన లక్ష్యార్థాన్ని నిరంతరము మరువకుండా ధ్యానించటమే గురువాజ్ఞ పాలన. అంతేగాని సద్గురుమూర్తి కాళ్ళు విరగగొట్ట నవసరం లేదు. ఆయనకి కాళ్ళు నొప్పులు వుండవు. గురుబిడ్డ అయినవాడికి మరణం ఎక్కడిది? స్థూలదేహం విచ్ఛిన్నమై సర్వవ్యాపకమైన ఆత్మలో లయమై సర్వవ్యాప్తమైన తానుగా ప్రకాశిస్తాడు. అక్కడ గుణాలు లేవు. వ్యథ లేదు. శీతోష్ణాలు లేవు. అది ఆనంద స్థితి. అయితే గురుబిడ్డ అయి ఉండాలి.

గురుబిడ్డ అంటే వివేకము, వైరాగ్యము, ఇంద్రియ సంయమనము కలిగిన ముముక్షువు. సంకల్ప రహితుడై ఎంతటి వ్యథ కలిగినా గురులక్ష్యార్థము నందు విశ్వాసముతో లక్ష్యము నందు తత్పరత, ఆవేదన కలిగిన సాధకుడు ముముక్షువు కాకుండా పోతాడా! భగవద్గీతలో గీతాచార్యుడు చెప్పినట్లు అంత్యకాలములో మనస్సు భగవన్నామముపై నిలుపుదాము అనుకోవటం అవివేకం. అంత్యకాలము ఎప్పుడు వస్తుందో ఎవరు చెప్పగలరు? నీవు వదిలే ప్రతి శ్వాస అంత్య శ్వాస కావచ్చు. కాబట్టి సద్గురుమూర్తి ప్రసాదించిన లక్ష్యార్థ సాధన క్రమము తప్పకుండాచేసే సాధకునికి మనస్సు భగవన్నామ స్మరణలో ఊరి అంత్యకాలములో కఫవాతపిత్తములు అడ్డుపడినా స్మరణపైన మనస్సు నిలబడి మరణవేదన నుంచి సంరక్షిస్తుంది.

అలా కాకుండా ప్రాపంచిక వ్యవహారాలలో మునిగి ఉన్న సాధారణ మానవుడి విషయంలో అంత్యకాలంలో మనస్సు ఎలా ఉంటుందని ప్రశ్నిస్తే అది చెబితే హడలి చస్తారు. కాబట్టి అంత్యకాలం సంగతి ఆలోచించకుండా ఈ క్షణం నుంచి సద్గురుమూర్తి ప్రసాదించిన లక్ష్యార్థ సాధనలో మునిగి ఉన్న సాధకుడు భయపడవలసిన పని లేదు" అన్నారు. *

## శివానందలహరి

(గత సంచిక తరువాయి)

-బులుసు మల్లిక్ USA

4. ***సహస్రం వర్తంతే జగతి విబుధాః క్షుద్రఫలదాః***
***న మన్యే స్వప్నేవా తదనుసరణం తత్కృత ఫలమ్***
***హరిబ్రహ్మాదీనామపి నికటభాజా మసులభమ్***
***చిరం యాచే శంభో శివ తవ పదాంభోజ భజనమ్ ॥***

ప్రతిజీవీ ముముక్షత్వాన్ని పొందాలనే పరితపిస్తున్నాడు. కాని దానిని ఎలా పొందాలో తెలుసుకోలేక పోతున్నాడు. ***మోక్షసాధన సామగ్ర్యాత్ భక్తి రేవ గరీయసీ*** అని తెలుసుకున్న భక్తుడు కూడా భక్తిలో ఏకాగ్రత లేని కారణం చేత శాశ్వతమైన శివానందాన్ని పొందలేక తికమక పడుతున్నాడు. దానికి కారణం కేవలం **అనన్యత్వం** లోపించడంచేతనేనని మనం గ్రహించాలి. దీనికే గీతాచార్యుడు కూడా ***అనన్యశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే*** అంటాడు. ఉపాసన ద్వంద్వాతీతం కావాలి అప్పుడే భక్తి సఫలీకృత మవుతుంది.

అనన్యత్వం యొక్క విశిష్టత నారదభక్తి సూత్రాలలో కూడా ప్రస్ఫుట మవుతుంది. ఒక భక్తి సూత్రంలో ***తస్మిన్ననన్యతా*** అంటూ అనన్యత్వం యొక్క ఆవశ్యకత చెప్పబడింది. ఇంకొక భక్తిసూత్రం అనన్యత్వాన్ని నిర్వచిస్తూ ఏమంటోందంటే ***అన్యాశ్రయాణాం త్యాగో అనన్యతా*** ఆశ్రయించిన పరతత్త్వానికి పోటీ వేరేదేమీ ఉండకూడదు. పోటీ ఉందంటే పరతత్త్వంలో పరిపూర్ణత్వాన్ని మనం గ్రహించ లేదనేకదా. అలా అనన్యమైన పరిస్థితికి మన భక్తి చేరుకొన్ననాడు ఆధ్యాత్మిక పయనం సుగమ్యమవుతుంది అనడంలో ఎంత మాత్రమూ సంశయం లేదు. శంకరులు కూడా యీ శ్లోకంలో ముందస్తుగా అనన్యత్వాన్నే ప్రతిపాదిస్తున్నారు.

***సహస్ర వర్తంతే జగతి విబుధాః క్షుద్ర ఫలదాః*** అంటున్నారు ముందస్తుగా. జీవుడు ఏదైనా ఫలాన్ని ఆశించి పూజ చేశాడే అనుకుందాం. ఆ కోరికని తీర్చేఫలం ఉండవచ్చుగాక. తీర్చగల దేవతలు కోకొల్లలుగా వుండవచ్చుగాక. ముందస్తుగా ఆ ఫలము లౌకికమైన ఆనందానికి దోహదపడేదే అయితే మనం పొందే అనుభూతి క్షణికము. అంతేగాక ***జాయతే గచ్ఛతే ఇతి జగత్*** అని కదా. అలాంటి ఫలాల వల్ల ***పునరపి జననం పునరపి మరణం*** తప్పవు. ఇక మోక్షానికి చోటేది? వాటినే శంకరులు తుచ్ఛమైన

ఫలాలుగా నిర్ధారణ చేశారిక్కడ. వాటి వలలో మనం చిక్కుకోకూడదన్నదే యిక్కడ శంకరుల ఆవేదన.

ఇంకా ***సమన్యే స్వప్నేవా తదనుసరణం తత్కృవ ఫలం*** అంటున్నారు. మనం చూడండి ఒక్కొక్కపుడు ఏమంటాం, వాడి మాట చెప్పకు, వాణ్ణి కలలో కూడా తలచుకోను అంటుంటాం. శంకరులు కూడా అదే విధంగా అంటున్నారు. ఇదే గురువు యొక్క కారుణ్యానికి నిదర్శనం. ఎందుచేతనంటే మనం చర్చించుకునే విషయమా గంభీరమైనది. దానిని లౌకికమైన పదాలలో చెప్పకపోతే మనబోటివారికెలా అవగతమౌతుంది? మనమింకెప్పుడు తరింపబడతాం? ఇదీ శంకరుల ప్రశ్న. చిన్ననాడే శంకరులు లౌకికమైన విషయాలని అప్రయత్నంగా వదిలేశారు. అనన్యత్వాన్ని ఆశ్రయించారు. మన సాంప్రదాయాన్ని తప్పుత్రోవ పట్టించే భిన్నమైన మార్గాలని ఎన్నిటినో ఖండించారు. అందుచేతనే యీ మాట వేయగలిగారు. ఆయన వాక్కులు అద్వైతామృత వర్షాన్ని అవిరళంగా కురిపించే మేఘగర్జనలు. మానవ జన్మ అరుదైనది. దేని గురించి ప్రాకులాడుతున్నామో తెలుసుకోవాలి. దీనికే మరో విషయమేమిటంటే గురువునాశ్రయించాలి. ***ఈశ్వరోగురురాత్మేతి*** అన్నట్లుగా గురువే ఈశ్వరుడని గ్రహించాలి. గురుకృపకు పాత్రులమవ్వాలి. గురువు వేరు ఈశ్వరుడు వేరు అనే అపోహలో చిక్కుకుంటే మనల్ని యింకెవరూ రక్షించలేరు. ఇది తథ్యము.

ఇంకా ***హరి బ్రహ్మాదీనామపి నికటభాజామసులభం*** అంటున్నారు శంకరులు. అంటే హరిబ్రహ్మాదులకే లభ్యం కాదట శివపద సన్నిధి. అంత అరుదైన అవస్థ. ఇదే విషయం బ్రహ్మ విష్ణు మధ్య జరిగిన పోటీని తెలియబరుస్తూ శివానందలహరిలో మళ్ళీ వస్తుంది. శివుడో సర్వవ్యాపి, సర్వాంతర్యామి. దీనికే యథావాక్కుల అన్నమయ్య ***అమితాంభోజ భవాండభాండ నిలయంబై యుండు నీ యంతరంగము పట్టెంతయో దానికింక బహిరంగబెట్టిదో సూక్ష్మతత్వము దానంతకు మీదనేమి*** అని తన సర్వేశ్వర శతకంలో కొలుస్తాడు. పరమేశ్వరుని సర్వవ్యాపకత్వాన్ని గ్రహించి మన కర్తవ్యాన్ని శీఘ్రంగా తెలుసుకోవాలి. దీనికే ***చిరంయాచే శంభో శివ తవ పదాంభోజ భజనమ్*** అంటారు శంకరులు. అఖిల శుభములను ప్రసాదించు ఈశ్వర పాదపద్మాలను ఎల్లవేళలా యాచించాలని, దానికి మించి భక్తికి అలాగే ముక్తికి వేరే మార్గమేదీ లేదని శంకరులు అనుకరణ రూపంగా కర్తవ్యాన్ని మనకు తెలియబరుస్తున్నారు.

ఇంకో విషయమేమిటంటే విష్ణువుని కొలిచినప్పుడు భజగోవిందంలో శంకరులు ఇదే రీతిలో కొలిచారు. లౌకికమైన ఫలాల వెంబడి పోవద్దని జాగ్రత చెప్పారు. సౌందర్యలహరిలో అమ్మవారిని కూడా యిలాగే కొలిచారు. ముఖ్యంగా **త్వదన్యః పాణిభ్యాం అభయవరదో దైవతగణః** అన్న శ్లోకం యీ శ్లోకాన్ని పోలి ఉంటుంది. అక్కడ కూడా అమ్మ పాదాలని శంకరులు గట్టిగా పట్టుకుని ప్రార్థిస్తారు. ఏ స్తుతినైనా సంపూర్ణంగా చేశారు శంకరులు.

మనం కూడా సంపూర్ణంగా భక్తిమార్గాన్ని అనుకరిద్దాం! గురుపాదుకలని గట్టిగా పట్టుకుందాం! సత్యధర్మాలను అవలంబిద్దాం! తరిద్దాం!!

## భగవన్నామ శక్తి అనన్యం! ఆశ్చర్యకరం!

*ఒక భక్తురాలు తన గురువుతోపాటు నివసిస్తూ సేవచేస్తూ ఉండేది. ఆమెకు సతతం నామజపం చేయటం అలవాటు. ఆమె పొయ్యిలోకి పిడకలు చేసి అవి ఎండలో పెడుతూ ఉండేది. ప్రక్కయింటి ఆమెకూడ పిడకలు చేసి వీటి ప్రక్కనే ఎండబెట్టేది. ఎండిన తరువాత అవి తీసుకోవడానికి వెడితే ఎలాగో అవి రెండూ కలసిపోయి ఉండేవి. పొరుగావిడ తన పిడకలతోపాటు యీ భక్తురాలి పిడకలు కూడా తీసుకుపోయేది.*

*గురువుగారు యీ విషయం విని తన శిష్యురాలి పిడకలు వేరు చేయటం తేలికైన పని అన్నారు. ప్రతి పిడకా చెవి దగ్గర పెట్టుకోగానే కొన్నిటి నుండి భగవన్నామం వినబడేది. అలాగ అన్ని పిడకలు చూసి వేరు పరచారు. తగాదా యిలా తీరిపోయింది.*

*ఎప్పుడూ నామ జపం చేయటం అలవాటు ఉన్న ఆమె పిడకలు చేస్తూ కూడా నామం చేసేది. ఆమె భక్తితో చేసిన నామం పిడకల్లో కూడా స్పందించింది. అందుచేత గురువుగారు చెవిదగ్గర పెట్టుకోగానే యీ పిడకల్లో నుంచి నామం వినబడింది!!*

# మౌన ధ్యాన సప్తాహ శిబిరం

-రమణ ప్రసాద్

మార్చి *24-3-2012* నుండి *30-3-2012* వరకు శ్రీమాతాజీవారు మౌనధ్యాన సప్తాహ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో బాలలు, వృద్ధులు దాదాపు *80*మంది పాల్గొన్నారు. ప్రతిరోజూ శ్రీమాతాజీవారు తమ బోధామృతాన్ని అందించి సాధకులందరికి ధ్యానం ఎలా చేయాలో,ధ్యానంలో ఎలా ఏకాగ్రతను సాధించాలో వివరించారు. శ్రీమాతాజీవారి బోధామృత సారానికి సంక్షిప్త వివరణ అందిస్తున్నాము............ ఎడిటర్

***మానస భజరే గురు చరణం। గురు చరణ మేవ మమ శరణం***

మానవ జన్మకి వచ్చినందుకు స్వతంత్రంగా జీవించటం అలవరచుకోవాలి. అంటే బుద్ధి ఎక్కడ స్వతంత్రంగా మనగలదో అదే ధ్యానం. ధ్యానం మన సహజ స్థితి. అది ఏవేవో ఆసనాలు వేస్తే వచ్చేది కాదు. చంటిపిల్లవాడు నిద్రపోతుంటే ఎంత హాయిగా ఉంటాడో మనం కూడా అటువంటి హాయిని అనుభవించాలి. అక్కడ ఏ ఆలోచనలూ ఉండవు. శరీరం విశ్రాంతి పొందుతుంది. మెలకువ రాగానే పూర్వపు వాసనలచేత విషయాలన్నీ గుర్తుకు వచ్చి, శాంతి భంగమవుతుంది.

మహాత్ములు మనని ఉద్ధరించటానికి అవస్థలు పడతారు. వాస్తవానికి వారికి అవస్థ లేదు. మనస్సు సహజ స్థితి నుండి బయటకు వస్తే ఏమవుతుంది? అర్జునుడికి వ్యామోహం వచ్చింది. ఎప్పుడు వచ్చింది ఏడుపు? ఎవరితో యుద్ధం చేయాలని వెళ్ళాడో వాళ్ళను చూసి వ్యామోహం వచ్చింది. శ్రీకృష్ణుడు ఉభయ సేనల మధ్య రథాన్ని నిలిపి "ఇక్కడ సమావేశమైన కౌరవులనందరినీ పరికించి చూడు" అన్నాడు. అర్జునుడు పెదతండ్రులను, పినతండ్రులను, మేనమామలను, తాత ముత్తాతలను, గురువులను, సోదరులను చూశాడు. శోకతప్తుడయ్యాడు.

పైపైన ప్రేమలు సుగర్ కోటెడ్ టాబ్‌లెట్స్ లాంటివి, అవి లోపల చేదుగా ఉంటాయి. ప్రేమలో మమకారం ఉండకూడదు. నీకు ఎలా వీలుగా ఉంటే అలా కూర్చో. మనస్సును ధ్యేయ వస్తువుపై ఉంచు. మనస్సు వెంటపడి వెళ్ళకు. ఆలోచనలకు అడ్డుగోడ వెయ్యి. 'ఇది ధ్యాన సమయం నా ప్రభువును ధ్యానిస్తున్నాను' అని మనస్సుకు నచ్చచెప్పు.

ప్రేమ నిధినే రూపంగా ధరించి శ్రీగురుదేవులు అవతారానికి వచ్చారు. రూపం, నామం, గుణం, లీల, సన్నిధి అని ఐదు తీసుకుని వచ్చారు. ధ్యానంలో మనస్సు కుదరటం లేదు అంటారు. వారి రూపాన్ని ధ్యానించు. వారి నామాన్ని

స్మరించు. వారి గుణగణాలను కీర్తించు. వారి లీలను మనస్సులో ముద్రించుకొని వారి సన్నిధిలో ధ్యానం చేయి. నువ్వు దేనిపై ధ్యానం చేస్తావో అక్కడ నీ మనస్సు నిలవాలి. అదే ధ్యానం. గురుపాదాలను భావన చెయ్యి. ఆ భావన ఒక అలౌకిక ప్రశాంతతను ప్రసాదిస్తుంది.

నీ భావన సద్భావనగా ఉండాలి. పిల్లవాడికి నీళ్ళుపోస్తూ శ్రీకృష్ణుడికి చేయిస్తున్నట్లు భావన చేయి, వాడికి అన్నం తినిపిస్తూ శ్రీకృష్ణునికే తినిపిస్తున్నట్లు భావన చెయ్యి. అంతేకాని మమకారం చెందకు.

ఆయన ప్రేమ సర్వభూతహితమైనది. వారి గుణాలు సుగుణాలు. కాని మన గుణాలు వాసన పూరితాలు. 'మనస్సు దేనిలో వేస్తే , దానికి ఆ స్వభావమే వస్తుంది' అనేవారు గురుదేవులు. వారి సన్నిధిలో కన్నులు మూసుకుని భావన చేస్తే ఆభావన రూపధారణ చేసి మనకు కనిపిస్తుంది. అంతేకాదు వినిపిస్తుంది కూడ. భగవంతుడు మనకు రెండు చెవులు యిచ్చాడు. బయట విషయాలను యీ చెవిలో నుంచి విని ఆ చెవిలోనుండి వదిలివేయాలి. కాని గురుదేవుల బోధను రెండు చెవులలో నుంచి విని హృదయంలో పదిలం చేసుకోవాలి. ధ్యానంలో హాయిగా భావన చేస్తూ 'బాబు' అనే ప్రపంచాన్ని విప్పితే ఎంత తృప్తి కలుగుతుంది! ఎంత ఆనందం లభిస్తుంది!

***'గురుదేవా! జయదేవా! శరణు శరణు సద్గురుదేవా!'*** అనే కీర్తనలో బాబు ***'కృష్ణా!....... శరణు శరణు సద్గురుదేవా!'*** అని ఆలాపించేవారు. ~~ఈ~~ కీర్తనలో ఎంత ఆర్తి ఉంది! మనస్సు పెట్టి వింటే మన యింద్రియాలు ప్రశాంత స్థితికి వస్తాయి. నిరాకారా హే! నిరంజనా! జీవాధారా జీవేశ్వరా! నిర్గుణ నామాలంటే గురుదేవులు ఎంతో యిష్టపడేవారు. వారి దృష్టి జ్ఞాన దృష్టి. "ఆత్మానందమే ఆనందం. ఆత్మ రతే రతి. ఆ స్థితిని మీరు పొందండి" అని మనకు ప్రబోధించారు గురుదేవులు. భవసాగరం దుస్తరమే. కాని మనం గట్టుమీద ఉన్నాం. వారు మన చెయ్యి పట్టుకుని ఉన్నారు. వారిది మార్జాల కిశోర న్యాయం. పిల్లి తన పిల్లలను నోట కరచుకుని సురక్షిత ప్రదేశానికి తీసుకెడుతుంది. అలాగే గురుదేవులు ఎన్ని చోట్లైనా తిప్పగలరు. మనలను సురక్షితంగా ఉంచగలరు. ప్రతి కదలికలో గురుదేవుల ముద్రను అనుభవిస్తే అది ధ్యానంగా మారిపోతుంది. ప్రపంచవిషయాలపై విరక్తి, భగవంతునిపై అనురక్తి పొందాలి. శ్రీబాబు లీలలను గుర్తుకు తెచ్చుకోవాలి. మనం వారి సన్నిధిలో ఉన్నాం. వివేకదృష్టితో ముందుకు సాగాలి. నీ యింటికి నువ్వెళ్తున్నావు. అదే ధ్యానమై వున్నది.

-సశేషం

# ఆశా ఫలితం

–సుశీలా ప్రసాద

స్వధర్మ నిర్వహణలో సమర్థుడైన ధనవంతుడు భద్రమూర్తి. ఎంతో ఆనందంగా కాలం గడచిపోతుంటే వానికి విధి ఎదురై పెద్ద జబ్బు చేసింది. తీవ్రమైన అనారోగ్యంతో మంచం పట్టిన తండ్రి తాలుకు వ్యవహారాలన్నీ కొడుకులు చూసుకోసాగారు. జబ్బు నయమైంది అనుకునే తరుణంలో భద్రమూర్తికి వినికిడి శక్తి లోపించింది. చెముడు, బలహీనం వానిని బాగా కృంగదీశాయి. వైద్యులు వానికి వినికిడి శక్తి యిక రాదని తీర్మానించారు.

రోజులు గడిచాయి. కొంత తేరుకున్న భద్రమూర్తికి ఎప్పుడు ఎవరు ఏమనుకుంటున్నారో, అంటున్నారో తెలియదు. అన్నీ కాగితం మీద రాసి చూపాలంటే అయినవారికి, బయటవారికి కూడా విసుగు పుడుతోంది. భద్రమూర్తి మనస్సు చివుక్కుమంటోంది. నడవగల ఓపిక వచ్చాక ఒకనాడు చెఱువు గట్టుకేసి చల్లగాలిలో తిరిగిరావాలని వెళ్ళాడు. అక్కడొక పెద్దమఱ్ఱి చెట్టు క్రింద ఒక సాధుపురుషుడు కనిపించాడు. చుట్టూ కొందరు కూర్చుని వున్నారు. ఆయన ఏం చెప్తున్నారోగాని అందరూ ఆనందంగా తలలు ఊపుతున్నారు. తన్మయత్వంగా వింటున్నట్టున్నారు. భద్రమూర్తి ఆ దాపునే వున్న బండమీద కూర్చుని సభ ముగిశాక తిరిగి వచ్చాడు.

జరిగిన సంగతి కాగితం మీదరాసి 'ఆయన ఎవరు?' అని ప్రశ్న రాసి కొడుకులకి చూపించాడు. వాళ్ళు బదులు రాస్తూ "ఒక మహానుభావుడు. ఆయన దగ్గిర ఏవో మహిమలు కూడా ఉన్నాయని అందరూ చెప్పుకుంటున్నారు" అని రాశారు. అది చదివి భద్రమూర్తికి ఆనందమైంది. మర్నాడు ఆయన సన్నిధికి వెళ్ళాడు. సభ ముగిసి అంతా వెళ్ళిపోయాక ఆ సాధుమహాత్ముని దాపుకి వెళ్ళి పాదాలంటి నమస్కరించాడు. 'ఎవరు నాయనా?' అని ప్రశ్నించారాయన. తన సంగతి అంతా చెప్పాడు భద్రమూర్తి. 'అయితే ఏం కావాలంటావు?' అని సంజ్ఞలతో ప్రేమగా అడిగారాయన. భద్రమూర్తికి పుట్టెడు ఆశ పుట్టుకొచ్చింది. "స్వామీ! నాకు మళ్ళీ అన్నీ వినగలిగే శక్తిని ప్రసాదించండి. ఈ చెముడుతో చాలా బాధగా ఉంది" అన్నాడు. సాధువు చిరునవ్వు నవ్వి "నిజానికి నీకీ స్థితిలో ఉంటేనే సుఖంగా ఉంటుంది" అని ఎదుట ఉన్న ఇసుకలో రాసి చూపించారు. "స్వామీ! నేనన్నీ వినాలి. ప్రపంచంతో తిరిగి నాకు సంబంధం ఏర్పడాలి. ఇదివరకు లాగే నన్నంతా గొప్పగా చూస్తున్నారన్నది తెలియాలి" అని ప్రాధేయ పడ్డాడు. సరే యీ క్షణం నించే నీకు అన్నీ వినబడతాయి వెళ్ళు" అన్నారు.

ఆనందం పట్టలేక భద్రమూర్తి తిరిగి నమస్కరించాడు స్వామికి.

ఇంటికి చేరాక భద్రమూర్తికి గుమ్మంలోనే ఎదురైంది భార్య. "వచ్చారు ఈయన ఇక ఊపిరాడకుండా పనులన్నీ పురమాయిస్తూనే ఉంటాడు గోల!" అని గొణక్కుంటున్నదావిడ. తెల్లబోయాడు భద్రమూర్తి. తనకిప్పుడు వినబడుతున్నదని తెలియదు ఆమెకు. భారంగా లోనికి వెళ్ళాడు. కొడుకులు కూర్చుని 'రేపు నాన్నతో వీలునామ రాయించేద్దాం. ఎవరి భాగాలు వారు తీసేసుకుని విడివిడిగా హాయిగా ఉందాం. ఆయనతో మనం పడలేము. ఆ రోగిష్ఠికి చేసేందుకు అమ్మ ఉందిగా' అనుకుంటున్నారు. వాళ్ళ మాటలు విన్న భద్రమూర్తి గతుక్కుమన్నాడు. భార్యా బిడ్డల ప్రేమ యింతేనా? పెరట్లో పనివారు వున్నారు. 'కాసేపు తీరికగా ఉందని ఊసులు చెప్పుకుంటుంటే చేసేపని మానేసి ఏమి చేస్తున్నారు అని తిడతాడు బాబూ! వినబడకపోయినా చూస్తూ ఓర్వలేక' అంటూ నిష్ఠూరాలు ఆడుతున్నారు తనను. 'ఇప్పుడిలా అయిపోయాడు కాని, జబ్బువచ్చాక అంతకు మునుపు పులిలాగ ఉండేవాడు కద!' బయట అరుగు మీద కూర్చున్న యిద్దరు ఇరుగుపొరుగులు 'పొద్దుగూకులు ఏదోఒకటి మాట్లాడతూనే ఉంటాడు. వినలేక ఛస్తున్నాము. మనం చెప్పేది వినబడదు' అంటున్నారు. వీళ్లందరికీ తను వాళ్ళ మాటలు వినగలుగుతున్నానని తెలియదు.

చాలు ఇంతవరకూ తాను విన్నది. తన స్థితి ఏమిటో భద్రమూర్తికి అర్థమైపోయింది. ఏమీ వినబడని నిర్వికార స్థితిలోనే తనుంటే మంచిదని చెంపలేసుకుని పరుగెత్తుకెళ్ళాడు స్వామి సన్నిధికి. ఆయన పాదాల మీద పడ్డాడు. "స్వామీ! ప్రపంచం నన్ను నిందిస్తోందో, స్తుతిస్తున్నదో తెలుసుకోవాలనే భ్రమను నానుండి తొలగించారు. నేను తొందరపడి మిమ్మల్ని అనవసరంగా శ్రమ పెట్టాను. నన్ను క్షమించండి" అన్నాడు. 'అయితే ఏమంటావు?' అన్నారు స్వామి. వెంటనే భద్రమూర్తి "తిరిగి నా బదిరత్వం నాకు యిచ్చేయండి". అవిటివాడివైపోతావా? అంటున్న స్వామితో "లోకంతో సంబంధం లేని కేవలం దైవంతో నన్ను బంధించగల మాటలు మాత్రం నేను వినగలగాలి. అది మీ ద్వారానే జరగాలి. మీ చెంత నిలిచిపోతానిక" అన్న భద్రమూర్తి తలపై తన దివ్య హస్తాన్ని ఉంచి 'నీ ఆశ తప్పక నెరవేరుతుంది నాయనా!' అన్నారు స్వామి ప్రేమగా. అంతలో అందరూ వచ్చి కూర్చున్నప్పుడు స్వామి అందించే భగవంతుని లీలలు గుణాలు గురించిన మధురమైన బోధను వింటూ తన్మయుడైనాడు భద్రమూర్తి. తిరిగి యింటికి వెళ్ళినా కూడా యిక ఏ మాటలు వినబడలేదు. *

# సమర్ధ సద్గురు నాధుని దివ్య చరిత్ర

(గతసంచిక తరువాయి) – స్వామి విజయేశ్వరానంద ప్రసాద్

నిజానికి అక్కడకు వచ్చిన భక్తుల మధ్య ముందుగానే ఈ సమస్య మొదలైంది. దంపతులకిద్దరికీ ఒకేసారి దీక్ష యివ్వాలని అప్పటిదాకా పాటిస్తూ వస్తున్న సాంప్రదాయం మరి యిప్పుడు సుబ్బమ్మగారికి ఒక్కరికే దీక్ష యివ్వవచ్చునా? అని వారిలో వారు సతమతమవుతున్నారు. శ్రీబాబు దానిని పసిగట్టి, పై ప్రశ్న తామే లేవనెత్తి, సాంప్రదాయాలు ధర్మబద్ధమైనప్పుడే సత్సంప్రదాయాలు అవుతాయని అందరికీ బోధపరచగలిగారు. అది సమర్ధ సద్గురువులకు తప్ప మరొకరికి సాధ్యమయ్యేదికాదు.



ఆ రాత్రి ఆరాధన సమయంలో మరొక సమస్య వచ్చింది. ఆ సాంప్రదాయానికి చెందినవారు లేదా వారి వద్ద మూడు మంత్రదీక్షలు తీసుకున్నవారు, వారి శిష్యులు మాత్రమే ఆరాధనకు రావడానికి అర్హులు. మరి యిప్పుడు పరశురామయ్యగారు శ్రీబాబును వెంటబెట్టుకొని వచ్చారు. తాము ఎంతగా అభిమానించినా, శ్రీపరశు రామయ్యగారు యిక్కడి కూడా ఆ కుర్రవాణ్ణి వెంటబెట్టుకొని రావటమేమిటి? అసలు ఆ కుర్రవాడికి, ఆయనకు ఉన్న సంబంధం ఏమిటో తేల్చుకోవాలని నిశ్చయించారు.

ఆరాధనకు అందరూ లోపలికి వెడుతున్నారు. పరశురామయ్యగారు పిన్నితో లోపలికి వెడుతూ శ్రీబాబుగారిని కూడా లోపలికి రమ్మనమన్నారు. వాళ్ళు తమను సరిగా అర్థం చేసుకోలేదని, వాళ్ళకు తమ రాక సమ్మతి కాదని, తమను లోనికి తీసుకొని వెళ్ళటం వల్ల అనేక సమస్యలు తలెత్తుతాయని, విషాదకర పరిణామాలు చోటుచేసుకుంటాయని, తమని వదిలేసి లోపలికి వెళ్ళండని పరశురామయ్యగారికి నచ్చచెప్పటానికి శ్రీబాబు చాల ప్రయత్నం చేశారు. అయిన వారు పట్టువదలక పోవటంతో, యిష్టం లేకపోయినా బయలుదేరారు. తీరా గుమ్మంలో అడుగుపెడుతున్న శ్రీపరశురామయ్యగారిని ఆ భక్తులు అడ్డుకున్నారు. "మీరు వారిని (శ్రీబాబును) లోనికి తీసుకుని వచ్చే ముందు ఒక విషయం స్పష్టం చేయండి. ఇప్పటి వరకు మన సాంప్రదాయంలోని వారు కారు. ఇప్పుడు వారిని మీతో తీసుకొని రావాలంటే వారు మీ శిష్యులై

వుండాలి. వారికి మీరు మంత్ర దీక్ష యిచ్చి ఉండాలి. ఈ రెండు విషయాలూ మీరు అంగీకరిస్తేనే, వారిని కూడా లోనికి తీసుకు రావడానికి అవకాశం వుంటుంది." అన్నారు.

శ్రీబాబు వెనుతిరిగి వెళ్ళిపోతుంటే పరశురామయ్యగారు "ఒక్క క్షణం ఆగండి" అని, దృఢమూ, గంభీరమూ అయిన స్వరంతో వారందరితో యిలా అన్నారు "దీనికి నా జవాబు వినండి. మన ఆచారాలు, సంప్రదాయాలు అన్నీ మానవునిలోని మాధవత్వాన్ని గుర్తించి అభేద దృష్టిని అలవరచుకోవడం కోసం ఏర్పడినవే. శ్రీబాబు సాక్షాత్ నారాయణ స్వరూపులు. ఆత్మ జ్ఞాన నిధులు. కేవలం వయో భేదాన్ని బట్టి వారు నన్ను 'నాన్నగారూ!' అని మన్నిస్తున్నారు. కాని వారు తత్త్వతః జగద్గురువులు.

గురువులు ప్రంచంలో ఎక్కడ, ఎప్పుడు, ఏ నామ రూప భేదాలతో కనిపించినా, గురు తత్త్వం మాత్రం అద్వితీయము, అఖండము, అనంతము. దృశ్యమయమైన యీ ప్రపంచమంతా నిండియున్న ఆ గురుతత్త్వాన్ని నేను యీ మహాత్మునిలో పరిపూర్ణంగా, అనుభవ పూర్వకంగా దర్శిస్తున్నాను. అందువలన జగద్గురు మూర్తికి నేను గురువునని చెప్పుకోవటం కాని, సర్వ మంత్రాధిష్ఠాన స్వరూపుడైన ఆ పరిపూర్ణునికి నేనేదో మంత్రదీక్షనిచ్చే ప్రశ్న గాని అసంభవం.

మన సాంప్రదాయ మూల పురుషులు, నా పితృదేవులైన శ్రీ శ్రీరాములుగారి యందు, మీ సోదరుడనైన నా యందు మీకు యిసుమంత విశ్వాసం నిజంగా ఉన్నా, వారు రావటం మన గురుపీఠానికే గౌరవప్రదమని గ్రహించి, సాదరంగా సగౌరవంగా లోనికి ఆహ్వానించండి. అలా జరగని యెడల ఆదర్శాన్నే మరచి, అసత్య మార్గంలో అడుగు పెట్టే మీ సాహచర్యాన్ని, యీ సంఘాన్ని నేను యీ క్షణం నుండి నిరాకరిస్తున్నాను" యిలా పలికి పరశు రామయ్యగారు శ్రీబాబును, పిన్నిని వెంట తీసుకుని బయటకు వచ్చేశారు.

- సశేషం

భగవంతునిపై లగ్నమైన మనస్సు ప్రాపంచిక విషయాలను అంతగా పట్టించుకోదు. ఆనపచేనుకు అలవాటు పడిన ఆవును కొట్టినా, తిట్టినా వెళ్ళక మానుతుందా?

– శ్రీకాళీ ప్రసాదబాబు

# హంస దృష్టి

డా॥ మల్లి ప్రియ

(శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వరప్రసాద బాబుగారి దివ్య ప్రవచనాల నుండి)

ఈ ప్రపంచంలో సర్వ భూతాలలోనూ ప్రకాశిస్తున్నది పరమాత్మే. సకల నామాలూ ఆయనవే అని ఉపనిషత్తులు, వేదాలు, పురాణాలు, పవిత్ర గ్రంథాలు వివరిస్తున్నాయి. మహాత్ములు కూడా అలాగే చెబుతున్నారు. భగవంతుని ఏ రూపంలోనైనా ధ్యానించవచ్చు.

చదువు వచ్చినవారికీ రానివారికీ కూడా పనికివచ్చేది భక్తి మార్గమే. ఆత్మానందానుభూతి ఒక్క భక్తివల్ల మాత్రమే లభిస్తుంది. భగవంతుడు ఏ శస్త్రాలతోనూ బంధింపబడడు. భక్తి ద్వారా మాత్రమే ఆయనను బంధించాలి. కేవలం సన్న్యాసం తీసుకుంటేనో, బ్రహ్మచారిగా ఉంటేనో మోక్షం వస్తుందని అనుకోవటం భ్రమ.

జగదాధారుడైన శ్రీకృష్ణ పరమాత్మ యిలా అంటున్నాడు - "గాఢమైన విశ్వాసాన్ని నాయందు ఉంచండి. గాఢమైన విశ్వాసం అంటేనే భక్తి. భక్తి ద్వారానే మీరు నా అనుగ్రహాన్ని పొందగలరు. భక్తి ద్వారానే జనన మరణ రూపమైన సంసారాన్ని దాటగలమనే నమ్మకాన్ని పెంపొందించుకోండి."

బ్రహ్మానందానుభూతిని, పరమాత్ముని సాన్నిధ్యాన్ని మనం పొందాలంటే ఏం చేయాలి? ముందుగా 'హంసదృష్టి'ని అలవరచుకోవాలి. పాలను నీటిని కలిపి పెట్టినా, హంస నీటిని వదిలి పాలను మాత్రమే గ్రహిస్తుంది. అలాగే కనిపించేదంతా బాగా ఆలోచించి, ఏది నిత్యమో, ఏది అనిత్యమో, ఏది సత్యమో, అది అసత్యమో చక్కగా తెలుసుకోవాలి. ఇలాంటి హంసదృష్టిని అలవరచుకొన్నప్పుడు ప్రపంచం అసత్యమని గ్రహించి, సత్య స్వరూపుడైన భగవానుడొక్కడే నిత్యుడని తెలుసుకోవటం జరుగుతుంది. ఇక ఆ తరువాత కార్యక్రమం ఒక్కటే. నీటి నుంచి పాలను వేరు చేయగానే హంస ఆ పాలను త్రాగుతుంది. అలాగే మనమూ ప్రపంచం అసత్యమని గ్రహించగానే, మిగిలిన ఆ కృష్ణ రసాయనాన్ని భగవన్నామాన్ని మనసారా, తనివితీరా త్రాగవచ్చు.

పాలను త్రాగి హంస ఆరోగ్యంగా జీవిస్తుంది. కృష్ణ రసాయనాన్ని గ్రోలి మనం కూడా శారీరిక మానసిక ఆరోగ్యాలు రెంటినీ పొంది, అనంతరం శేషశయనుడైన ఆ పరమాత్మ సన్నిధికి చేరి, ఆయనలో లీనం కావచ్చు.

అయితే మీకొక పెద్ద సందేహం కలుగవచ్చు. హంసదృష్టిని పొంది, ప్రపంచం అనిత్యమని గ్రహించి, భగవంతుని సామీప్యం పొందాలనే కోరిక కలిగినప్పుడు ఈ భార్యా బిడ్డలను వదిలి పెట్టాలా? ధనార్జన మానేయాలా? అక్కర్లేదు. మన పనులన్నీ మనం చేసుకుంటూనే, పరమాత్ముని పై భక్తి భావాన్ని పెంచుకుంటే చాలు.

బట్టల వ్యాపారి వస్త్రాలను అమ్ముతూ, మడతలు పెడుతూ, బీరువాలో సర్దుతూనే ***ఓం కృష్ణా! ఓం కృష్ణా! కృష్ణాయ నమః*** అని అనుకోవచ్చు. స్త్రీలు కూరగాయలు తరుగుతూనే, వంట వండుతూనే ***ఓం కృష్ణ ఓం కృష్ణ కృష్ణాయ నమః*** అనుకోవచ్చు. నిరంతరం మన హృదయాంతరంగంలో యీ భగవన్నామం ప్రతిధ్వనించాలి. అప్పుడు డబ్బు గురించీ, సంసారం గురించీ బాధపడవలసిన పని లేకుండా, పరమాత్మే అన్నీ మనకిస్తాడు.

ఇక భగవన్నామం గొప్పతనాన్ని మనకు తెలియజేసేందుకు ఆచార్య దేవుని చేయూత మనకు అవసరం. వివేకానందుడు ఎందరినో కలుసుకొని, ' మీరు భగవంతుణ్ణి చూశారా?' అని ప్రశ్నించినప్పుడు 'పురాణాలలో యిలా ఉంది, ఉపనిషత్తులలో యిలా ఉంటాడు అని చెప్పబడింది' అని చెప్పారే గాని, దేవుణ్ణి చూసినట్లు ఎవరూ చెప్పలేకపోయారు. కాని శ్రీరామకృష్ణ పరమహంస మాత్రం నేను దేవుణ్ణి చూశాను. ఇప్పుడు నీలోనూ చూస్తున్నాను. కావాలంటే నీకూ చూపిస్తాను' అని అన్నారు. అంతే! వివేకానందుడు ఆయనకు పాదాక్రాంతుడయ్యాడు.

కనుక సాహిత్య జ్ఞానం కలిగిన గురువులు కాదు మనకు కావలసినది. అనుభవపూర్వకంగా ఆత్మబోధ చేయగలవారు కావాలి. వృక్షంలోనూ, చేపలోనూ కూడా జగన్మాతనే చూడగలిగిన రామకృష్ణునివంటి గురువులే నిజంగా మనకు కావలసింది.

కబీర్‌దాస్ కుమారుడు కమాల్‌దాస్. ఒక ధనవంతుడు అతనిచేత పదిరోజులు సంకీర్తన చేయించి, డబ్బుతీసుకోడని గ్రహించి, లక్షల విలువ చేసే ఒక రత్నాన్ని అతనికి తెలియకుండా అతని కొంగుకు కట్టాడు. ఇంటికి వెళ్ళిన కమాల్‌దాస్ తిరిగి వచ్చి ఆ రత్నాన్ని షావుకారుకు యిస్తూ 'నాకిది వద్దు. రామరత్నం నా వద్ద ఉండగా యిది అనవసరం ' అన్నాడు.

కనుక అట్టి రామరత్నం రామనామ జపం మనకు లభించుగాక! సుఖీభవ! సుఖీభవ!!

(గత సంచిక తరువాయి)

# అపరోక్షానుభూతి

-పరాశర ప్రసాద్

పరబ్రహ్మ తత్త్వము అక్షరమైనది. అంటే నశించనిది. ఘటములో ఆకాశం వచ్చేది, పోయేది కాదు. వచ్చేది పోయేది ఘటము మాత్రమే. దేహం వస్తుంది, పోతుంది. నేను మాత్రం వచ్చే, పోయే వాడిని కాను. ఊగే ఉయ్యాలలో మనిషి స్థిరంగా ఉన్నాడు. ప్రపంచం క్షరము. పరబ్రహ్మ అక్షరం.

భూమిలో ఉన్న నీటిని వెలికి తీసుకురావటానికి దానికి అడ్డుగా ఉన్న దానిని ఎలా తొలగిస్తావో అలాగే సాధకుడు తన మనస్సుని ఆవరించి ఉన్న ఆవరణని తీసివేయాలి. అశుభ్రమైన మురికిని తొలగిస్తే బట్ట తెల్లగానే వుంటుంది. పిల్లవాడికి మందుని అరటి పండులో పెడితే అరటిపండు తిని మందు వుమ్మివేస్తాడు. అలాగే సాధకులు భాగవత కథని జీర్ణం చేసుకుని దానిలో దాగి ఉన్న తత్త్వాన్ని మరచిపోతారు.

భగవంతుడు అన్ని దేశాలలోను, అన్ని కాలాలలోనూ అంతటా పాలలో వెన్నలాగా వ్యాప్తమై ఉంటాడు. అన్ని పరికరాలలో కరెంట్ ఎలా ఉందో అలా అన్ని రూపాలలో భగవంతుడు ఉన్నాడు. సాధకుడి దృష్టి అక్కడకి చేరకపోవటమే లోపం. పాత్రని శుభ్రం చేసేటప్పుడు ముందుగా లోపల శుభ్రం చేసి తరువాత బయట శుభ్రం చేసినట్లు, మనదేహమనే పాత్రలో కూడా ముందుగా మనస్సుని పవిత్రం చేసుకుని తరువాత బాహ్యేంద్రియాలను నిగ్రహించాలి.

ఇంద్రియాలు విషయాదుల యందు అనురక్తి కలిగి ఉంటాయి. కాబట్టి యింద్రియాలని అదుపులో పెట్టుకోవాలి. దానికి సహనము అవసరం. ఇంద్రియ సంయమనము ద్వారా దుఃఖ హరితమై శాంతి చేకూరుతుంది. సాధకునికి ఆధ్యాత్మిక, ఆదిభౌతిక, ఆదిదైవిక దుఃఖాలు కలుగుతాయి. స్థూల శరీరం ద్వారా కలిగే వ్యాధులు ఆధ్యాత్మిక దుఃఖానికి హేతువు. ఆదిభౌతిక దుఃఖం సాధకుడికి భిన్నంగా ఉన్న భూతములైన సూక్ష్మక్రిములు, జంతువులు, దొంగలు, శత్రువులు, మిత్రులు, భార్యా బిడ్డల ద్వారా కలుగుతుంది.

దుఃఖ సమయంలో సుఖాన్నిచ్చేది వేదాంతము. సాధకునికి దుఃఖం నుంచి విముక్తి కలగాలంటే సంసార బంధం నుంచి విముక్తి కలగాలి. సంసారం అంటే భార్య, పిల్లలు, ఇల్లు, వాకిలి కాదు. అది ఈశ్వర సృష్టి. అసలు సంసారం నీ లోపల ఉంది. అది జీవ సంసారం. అది మోక్షానికి బంధం. అహంకారమనే

విత్తము, మోహము అనే మందిరం, ఆశ అనే భార్య నీకు బంధము. వీటిని త్యజించాలి. అసంతృప్తి, దోషము అనేవి అవిద్యని సూచిస్తాయి. ప్రపంచ సుఖాలన్ని ఆత్మ ప్రేరణ చేతనే సాధ్యపడుతోందన్న విషయాన్ని సాధన చతుష్టయ సంపత్తి సంప్రాప్తించిన సాధకుడు విచారణ ద్వారా తెలుసుకో గలుగుతాడు. విచారణ కొనసాగించేటప్పుడు నీ గురుదేవుడు నీ వెంటనే వున్నాడని గ్రహించాలి. సాధకుడు ధ్యానానికి కూర్చుని చిత్తాన్ని జ్యోతి మీద గాని, శ్వాస మీదగాని, భ్రూమధ్యమునందుగాని, నాసికాగ్రమున గాని, హృదయము నందుగాని నిలుపుతాడు. చిత్తము లక్ష్యమునందు నిలిచినప్పుడు మాత్రమే ఆనందాన్ని పొంద గలుగుతాడు.

సాధకులు కొంతమంది ఏకాంతాన్ని కోరుకుంటారు. కొంతమంది పదిమందిలో ఉండాలని కోరుకుంటారు. నిజమైన సాధకుడు ఎక్కడైనా వుండగలగాలి. నిజమైన సన్న్యాసి సాధన ఏకాంతంలోనూ, ప్రబోధం పదిమందిలోనూ చేస్తారు. ఇంద్రియాలు ఎన్నడూ చెడ్డవి కావు. ఇంద్రియ వేగం చెడ్డది. నీరు చెడ్డది కాదు. నీటి వేగం ప్రమాదం తెచ్చిపెడుతుంది.

సుఖం పుణ్యాన్ని మరపింప జేస్తుంది. దుఃఖం పాపాన్ని జ్ఞాపకం చేస్తుంది. సాధకునికి కష్టాలు ప్రయాణంలో మైలు రాళ్ళుగా ప్రయాణంలో తాను ఎక్కడ ఉన్నది తెలియజేస్తాయి. మనస్సు ఉన్నంత వరకు సుఖదుఃఖాలు, రాగద్వేషాలు, ఈర్ష్య, అసూయ, శరీరం ఉన్నంతవరకు ప్రారబ్ధం తప్పదు కదా!

> జ్ఞాని కాలిపోయిన కాగితం వంటివాడు. కాగితం కాలిపోయినా అక్షరాలు కనబడుతూనే ఉంటాయి. రివ్వున గాలి వీస్తే మసి చెల్లాచెదురై పోతుంది. అటులనే జ్ఞాని మామూలు మనిషిలా సంచరించినా దేనికీ అంటకుండా బంధ రహితుడుగా ఉండగలడు. కాగితానికి బంధించే శక్తి లేనట్లే , జ్ఞాని అశరీరి.
>
> – శ్రీకాళీబాబు

# నేను అర్థం చేసుకున్న జ్ఞానయోగం

-కొండ వెంకట్రాజు

భగవంతుడు చెబుతున్నాడు 'ఓ అర్జునా! వశిష్ఠుడు మొదలైన మునులందరూ జ్ఞానములన్నిటిలోను శ్రేష్ఠమైన ఈ జ్ఞానమును (త్రిగుణాల యొక్క జ్ఞానమును) తెలుసుకుని మోక్షాన్ని (నన్నే) పొందారు. అట్టి ఉత్తమమైన జ్ఞానాన్ని వివరిస్తున్నాను. విను, తెలుసుకో. ఈ జ్ఞానాన్ని పొందినవారు జనన, మరణ చక్రం నుండి తప్పించుకొని నా సాయుజ్యమును పొందుతున్నారు.

సకలము వృద్ధి చెందటానికి నిలయమైన ప్రకృతి బ్రహ్మమని చెప్పబడుతోంది. ఈ ప్రకృతి యొక్క యోనిలో నేను చైతన్యం అనే బీజాన్ని ప్రవేశపెట్టటం వలన సమస్త ప్రాణులు పుట్టుకొని వచ్చాయి. ప్రకృతి సహాయంతో ఈ ప్రాణులన్నీ అభివృద్ధి చెందుతున్నాయి. చైతన్యం అనే బీజాన్ని తిరిగి మరల ఉత్పన్నం చేసుకొని తమ తమ శాఖలను ద్విగుణీకృతం చేసుకుంటున్నాయి. ఈ విధంగా సమస్త సృష్టి భగవంతుడి నుంచే వచ్చింది అని అర్థం అవుతోంది.

ఈ ప్రకృతి నుండి మనకు సంక్రమించిన గుణాలు మూడు. అవి సత్వగుణం, రజోగుణం, తామస గుణం. ఈ మూడు గుణాలు మన దేహములో ఉన్న నాశరహితమైన ఆత్మని, ఆ దేహమందే బంధిస్తున్నాయి. కాబట్టి మనం ఈ గుణాలను గురించి విస్తారంగా తెలుసుకొని గుణరహితులమైతే ఆత్మజ్ఞానం కలుగుతుంది. భగవంతుడు యీ త్రిగుణాల గురించి 14వ అధ్యాయం, గుణత్రయ విభాగయోగంలో వివరించాడు.. ఈ గుణాల గురించి తెలుసుకుందాము.

***తమో గుణాలు*** - భ్రమ, సోమరితనం, అతినిద్ర, అజాగ్రత్త, బద్ధకం మొదలైన గుణాలు ఈ కోవలోకి వస్తాయి. ఇంకా వ్యభిచారం, యితరులను మోసగించటం, ఎప్పుడూ అసత్యాలని పలకటం, హత్యలు చేయటం, చేయించటం, దొంగతనాలు చేయటం, మాదక ద్రవ్యాలకు అలవాటు పడటం మొదలైనవి కూడా ఈ కోవకే చెందినవి. నిజానికి యీ తమో గుణాల లిస్టు చాలా పెద్దది.

***రజో గుణాలు*** - పంచేంద్రియాల ద్వారా అనురాగం పెంచుకోవటం రజోగుణ ప్రధాన లక్షణం. మంచి అనుకొన్న వాటి గురించి అనురాగం పెంచుకోవటం, కొడుకులు, మనుమలు, మనుమరాళ్ళతో మితిమీరి అనురాగం పెంచుకోవటం, శ్రమించి పనులను చేసి ఫలితాన్ని దైవానికి వదలక అంతా మంచే జరగాలనుకోవటం

కూడా రజోగుణం లాంటిదే. ఈ గుణాలను కూడా తగ్గించుకోవాలి, లేదా వదిలివేయాలి.

**సత్వ గుణాలు** - ఎప్పుడూ సత్యం పలకటం, ఏ ప్రాణి యందూ ద్వేషం లేకుండా ఉండటం, సమస్త ప్రాణికోటిని ప్రేమతో చూడటం, మితాహారం, మితనిద్ర, మితభాషణం, శాస్త్రజ్ఞానం వలన కలిగిన తృప్తి లాంటివి సత్వగుణ సంపన్నాలు. ఇవి కూడా మన ఆత్మని శరీరంలో బంధిస్తాయి కాబట్టి యిటువంటి శ్రేష్ఠ గుణాలు కూడా చివరిగా వదిలివేయదగినవే.

ఈ శీర్షిక చివర ఒక టేబుల్ యివ్వబడింది. ఈ టేబుల్ లో త్రిగుణాల కలయకని 5తరగతులుగా విభజించి చూపించటం జరిగింది. దీన్ని పరిశీలించి మనం ఏ తరగతిలో ఉన్నామో చూసుకోవచ్చు. అక్కడి నుండి ఏ విధంగా ముందుకు వెళ్ళాలి అని ప్రణాళికలు వేసుకోవచ్చు. మన మనస్సు రంగుటద్దాల నుండి యీ గుణాలని చూస్తూ ఉంటుంది. మనకి ఉన్న గుణాలు శ్రేష్ఠమైనవే అని, తామస, రజో గుణాలు అసలు లేవు అని నమ్మబలుకుతుంది. కాకి పిల్ల కాకికి ముద్దు అని మన గుణాలు మనకు ముద్దుగా అనిపిస్తాయి. నిష్కర్షగా త్రిగుణాలను రహితం చేసుకోవాలి. మనం చదివే పుస్తకాలు, మనం ఉండే సంఘం, మన ఆహార వ్యవహారాలు, మన మాట మంచి కూడా మనం ఏగుణ సంపన్నులమో తెలియజేస్తుంది.

- సశేషం

*యూరపు యుద్ధంలో నావికుణ్ణి ఒకడిని బందీగా చేసి ఖైదులో పెట్టారు. 15సం॥ల తరువాత సంధిచేసుకుని ఆ ఖైదీనీ విడుదల చేశారు. విడుదలైన రోజునే అతనికి స్నేహితుడు ఒకడు 50రూ॥లు యిచ్చాడు. ఆ బందీ వెళ్ళిపోతూ బజారులో ఒక కొట్టులో అందమైన పక్షుల్ని అమ్మటం చూసి, చేతిలో డబ్బంతా యిచ్చి పక్షులన్నిటినీ కొన్నాడు. కొనగానే వాటినన్నిటినీ వదిలేశాడు. ఇంత ఖరీదుపెట్టి పిట్టల్ని కొని వాటిని పంజరాలలో నుంచి ఎందుకు వదిలివేశావు? అని కొట్టువాడు ఆశ్చర్యంగా అడిగాడు. 'స్వేచ్ఛ విలువ నాకు తెలుసు కాబట్టి' అని సమాధానమిచ్చాడు ఆ బందీ. ముక్తి చెందిన మహాత్ములు మిగిలిన వార్ని కూడా విముక్తుల్ని చేయటానికి కృషి చేస్తారు.*

–స్వామి రామదాస

# తరణి

-సుశీలా ప్రసాద

తరణి అనే బుద్ధిమంతుని హృదయ క్షేత్రంలో సత్సంగీయుల ద్వారా సచ్చింతన, సద్విషయ విచారణ అనే పుష్టి అయిన బీజాలు నాటబడ్డాయి. అతడు శ్రద్ధ అనే నీరు పోసి, లౌకిక విషయాలు, కోరికలు అనే కలుపు మొక్కలను ఏరివేస్తూ నిదిధ్యాసలనే వ్యవసాయం చేసే సరికి పంట ఏపుగా పెరిగింది. ఫలితాన్ని అందుకుని అనుభవం పొందగల మార్గాన్ని చూపించే సత్యగురువు యిప్పుడు తనకి అవసరం అనిపించింది వానికి.

సద్గురువు యొక్క పాదపంకజములను సేవించకుండా నిష్కల్మషమైన వైరాగ్యాతిశయం లభించదు. గురుమూర్తి పాదోదకాన్ని పానం చేయకుంటే బ్రహ్మజ్ఞానానుభవం, అపరోక్షానుభూతి లభించదు. గురుదేవులు భుజింపగా శేషించిన పదార్థాన్ని సుప్రసాదమును గ్రహించకపోతే నిరుపమానమైన చిత్తశాంతి వలన కలిగే ఆనందం లభించదుగదా!

సద్గురు స్వరూపాన్ని తనయందు తెలిసికొనకుంటే సర్వోత్తమమైన మోక్షం సిద్ధించదు. కాబట్టి బ్రహ్మవిద్యను కోరే విద్యార్థి వినయభయభక్తులు తన మనస్సులో నిలుపుకుని స్థాన, అంగ, భావ, ఆత్మ అనే నాలుగు విధాలైన ఉపచారాలను ఆచరిస్తూ ఎల్లప్పుడూ శ్రీగురునాధులను సేవిస్తూ ఉంటాడని పురాణ పురుషుల సత్యవాక్కులను అతడు వీనుల విందుగా విని ఉన్నాడు. ఆవిధంగా శ్రీగురు సేవాభాగ్యాన్ని పొంది తరించాలనే ఆకాంక్షతో జిజ్ఞాసువైన తరణి తగిన గురుమూర్తి కోసం వెదకసాగాడు.

ఆత్మ తత్త్వాన్ని అనుభవంతో తెలుసుకొని దర్శించి, ఆ ఆత్మస్వరూపమే తానై , తననాశ్రయించిన శిష్య వర్గానికి అనుభవ పూర్వకంగా తత్త్వ దర్శనం చేయించగల సమర్థుడైన సద్గురుదేవుని సమాశ్రయం తనకి లభించినట్లయితే తాను తరించగలడు. ఎన్నో జన్మల పుణ్యాం రాశీభూతమైతేగాని అట్టి సద్గురువు లభించడు. దైవికంగా తన పాత్రను శుద్ధి చేసుకుని ఉన్న తరణి తన కృషిలోపం లేకుండా ప్రయత్నాలు చేయసాగాడు. వాని శ్రమ ఫలించింది. జాడ దొరికింది. తగిన శిష్యుడిని అనిపించుకోవాలనే బలమైన కోరికతో ముందడుగు వేశాడు. అంతలోవాని మనస్సులో రవంత సందేహం కలిగింది. తానాశ్రయించిన గురుదేవులు సమర్థులని తనకి ఋజువు కావటం ఎలాగ అని! అది వారే తీర్చాలి అని తలపోస్తూ తరణి గురుసన్నిధికి బయలుదేరాడు.

కొంత దూరం నడిచాక మార్గాయాసంతో ఆగి చేరువనే ఉన్న ఒక చెట్టునీడన విశ్రమించాడు. అలసిపోయి నిద్రించిన వానికి కాలం తెలియలేదు. మెలకువ వచ్చేసరికి పొద్దుగూకిపోవచ్చింది. తన సోమరితనాన్ని తాను నిందించుకుంటూ త్వరత్వరగా సాగిపోయి గురుసన్నిధికి చేరుకున్నాడు. వాని భాగ్యాతిశయమేమో ఆచార్యులు వెంటనే దర్శనమిచ్చారు. వినయ భయభక్తులతో వారికి సాష్టాంగ నమస్కారం చేసి అంజలిబద్ధుడై నిలిచాడు తరణి.

"దారిలో ఆటంకాలేమైనా ఎదురైనాయా? రావటం ఆలశ్యమైంది?" వాత్సల్య పూరితమైన స్వరంతో శ్రీగురుదేవులు ప్రశ్నించేసరికి, వారికి తనరాక ముందే తెలిసినందుకు విస్తుపోతూ, ఆ పైన లజ్జాభారంతో తల వంచి, "గురుదేవా! నా పాడు నిద్రే నన్ను ఆటంకపరచింది. దాన్ని జయించలేక పోయాను" వ్యాకులతతో పలికాడు. "లేదు నాయనా! నీ నిద్రే నిన్నెన్నో విధాల కాపాడింది. నేనిక్కడి నుంచి నిన్ను గమనిస్తూనే ఉన్నాను. నీ గురించి నాకంతా తెలుసు." గురుదేవుల వాక్కులు వింటూ తరణి ఆశ్చర్యపోతుంటే తిరిగి వారు చెప్పటం కొనసాగించారు. "జరిగినదంతా చెబుతున్నాను విను. నువ్వు బడలిపోయి ఒడలు ఎరుగకుండా నిద్రిస్తున్న తరుణంలో, కోటీశ్వరుడైన ధనవంతుడొకడు నీ రూపురేఖా విలాసాలను గమనించి, ముచ్చటపడి, 'నాకు సంతానం లేదుకదా! వీనిని తీసుకుని పోయి దత్తత చేసుకుని కోట్లకొద్దీ ఉన్న నా ఆస్తికి వారసుని చేయనా!' అని తలపోశాడు. కానీ తన ఆలోచనకి అంతలోనే స్వస్తి చెప్పి ఏ జ్యోతిష్కుడో వీని హస్తరేఖలు చూసి వీడొక నష్ట జాతకుడు అని చెప్తే యిక నాగతి అధోగతి అవుతుంది. వద్దులే అనుకుంటూ తన దారిన తాను సాగిపోయాడు. చూశావా! వాని ఆలోచన ఫలిస్తే నువ్వొక కోటీశ్వరుడివి అయి ఉండేవాడివి కదా!" అన్నారు గురుమూర్తి నిశితంగా తరణిని చూస్తూ.

తన మనస్సుని పరీక్ష చేస్తున్నట్లున్న ఆ మాటలను వింటూ, చలించకుండా "నేనాశ్రయించిన నా గురుదేవుల పాదసన్నిధిని మించిన పెన్నిధి లేదు. నాకక్కర్లేదు" అన్నాడు తరణి దృఢమైన స్వరంతో. "ఔను. నువ్వెక్కడ ఆ సిరి వలలో చిక్కుకుని అమూల్యమైన నా ఆధ్యాత్మిక సంపదకు వారసుడవు కాకుండా దూరమైపోతావేమోనని భయంతో నేనే ఆ ధనవంతుని మనస్సును ఆక్షణానే మార్చివేశాను" అంటున్న గురుమూర్తితో ఆర్ద్ర హృదయంతో 'నా కెంత మేలు చేశారు గురుదేవా!' అన్నాడు తరణి.

-సశేషం

# శ్రీరామ నవమి

– జిల్లేపల్లి

ఓంకారము నాశనము లేనది. శ్రీకారము దానికి మారు రూపము. శ్రీరామ అను శబ్దము బ్రహ్మ, విష్ణు, శివాత్మకము. ఇదియే ప్రకృతి రహస్యము. మాయా విచ్ఛేదన సూత్రము ఓంకారము నందు సనాతనమైన పరబ్రహ్మ లీనమై యున్నాడు. ప్రణవమును జపియించినవాడు తప్పక ముక్తి పొందుతాడు.

మహత్తు నుండి క్షణక్షణము విడిపడే అణుశక్తి తిరిగి మహత్తునే చేరుతుంది. అందుచే అణువు నుండి మహత్తును, మహత్తులోని అణువును గ్రహింపవలసినట్లు మానవులు తన నుండి పరబ్రహ్మమును, పరబ్రహ్మము నుండి జీవుణ్ణి గ్రహించే సాధనలో ప్రయత్నిస్తే పరబ్రహ్మమును పొందగలరు. దీనినే ముక్తి అంటారు.

సమస్త భూత లోకము పరమాత్మయే అని తెలిసి ఏకత్వమున చూస్తాడోఅట్టివానికి మోక్షము అందుబాటులో ఉంటుంది. స్వప్నమందు కనిపించేవి పదార్థములుగా భ్రమ కలిగించునట్లు అవిద్యచే మానవులు తనకు వేరుగా లోకములను కనుగొంటారు. అట్టి అవిద్యచే లింగ శరీరముతో నిండిన వాడుగా పరమాత్మ గోచరిస్తాడు.

ఈ లింగశరీరము పాప పుణ్యములనబడే కర్మఫలమును అనుభవించుటకు జీవాత్మ లింగశరీరస్థుడై మాయావరణను దాటుతాడు. మంద నుండి వెళ్ళిన లేగదూడ మందను చేరే ప్రయత్నము చేయక అటు ఇటు తిరిగి తన స్వాతంత్ర్యమును వెలగబోయ పోయి మందను తప్పి మరుగుడులు పడిపడి తరువాత మార్గదర్శియైన సత్యరూపుని కృపవలన తిరిగి మందజేరినట్లు మానవులు పరమాత్మ నుండి విడువడి అణురూపమైన జీవులు లింగదేహ ధారణ వలన దూరమై తాము పరమాత్మను జేరు క్రియాత్మక భావన కోల్పోయి తిరిగి తిరిగి పుడుతూ చస్తూ , ఒక సద్గురు మూర్తి కృప వలన పరమాత్మనే చేరగలుగుతారు.

మురికిగా ఉన్న అద్దము చూచు వానికి అందులో ప్రతిబింబము కూడా మలినమైనట్లు, పరమాత్మను గుర్తించలేని అనగా తాను తెలియలేని జీవాత్మ తాను వేరుగా ఉన్నట్లు భావించి, పరమాత్మను చేరుటకు సంశయాత్ముడై చాల బాధలకు చిక్కి లింగదేహ నాశనము పొందువరకు ముక్తిని పొందలేడు.

మన యందున్న 'ఆత్మ' రాముడు. ఆ రాముడు కారణ జన్ముడై దేహధారణ పొందినట్లు శ్రీమన్నారాయణుడు లోకత్రయవాసియైనప్పటికి భూ భారము బాపగా భూలోకము నందు మానవ రూపమున వర్తించి, రాక్షస గణములను సంహరించి, రామరాజ్యమును స్థాపించాడు. రామరాజ్యమన్న ప్రాశస్త్యము. అందువలన గల సుఖశాంతులే కారణము.

స్వార్థపూరితుడైన మానవుడు తను వేరు, పరమాత్మ వేరుగా భావించి పరమాత్మ జేరు ప్రయత్నములో సుఖ శాంతి సాధనకు పూనుకొనక స్వప్రయోజన దృష్టిని పెంచి కార్యా కార్యములందు చిక్కి ప్రతిఫలమును అనుభవించేందుకు పుట్టి చచ్చుటల యందు చిక్కుతాడు. భయభ్రాంతిని పొందుతాడు. భయము, భ్రాంతి జీవుని సహజ లక్షణాలు కావు. కాని యీ వ్యావృత్తమైన జీవి క్షణక్షణము ఆవేదనతో క్రుంగి క్రుంగి ఐహిక వాంఛలకు దూరంగా ఉండాలనే భావనకు వచ్చి, బ్రతుకు భారంగా గుర్తించి, దానిని తప్పించుకోవటానికి, ముక్తిని పొందటానికి ప్రయత్నం మొదలుపెడతాడు.

ఇట్టి సాక్షాత్కారమే **శ్రీరామ నవమి.** దేహానికి గల నవ రంధ్రములు మూసి, మనస్సును అంతర్ముఖము చేసి, బుద్ధిని పెంచినచో బాహ్యదేహ వాంఛలు, బంధాలు నశించి, ఆత్మ సాక్షాత్కారము దగ్గరగా అవుతుంది. భోగములు పొందు వారికంటె బాధలు పడువారికి దేవుడు వెంటనుండి చేయూత కలిగించి, విశ్వాసాన్ని , వేదాంతాలు ఆత్మ జ్ఞాన సాధనలు బలపరుచటలో గల పరమార్థము మానవుడుగా. అవిద్యలో ఉన్న మానవుడు జ్ఞానాన్ని పొందటానికి, జ్ఞానులైనవారిని శరణాగతి పొందటం వలన జ్ఞానసముపార్జన సులభమగుటయే. దైవాంశ అందరిలో ఉన్నా, పరమాత్మలో ఐక్యమవటానికి చేయు జీవ ప్రయాణములో పై మెట్టునందున్న సద్గురువుల చరణ సమాశ్రయము త్వరగా దిగువ మెట్టునపై వున్నవారికి దోహదము కలిగిస్తుంది.

సద్గురు సమాశ్రయము వదలరానిది. గురుదేవునే పరమాత్మగా శరణు పొందుటలో సిద్ధాంతాచరణలో మానవులు చూపించే ప్రయత్నమునకు విశ్వాసముతో ధృవీకరణలో పొందు నిదర్శన పూర్వక ప్రయోగముగా గురుసేవ తారణమవుతుంది. గురువును నమ్మి, కొలచి, సేవించి, తరించుట సులభమని అనుభవజ్ఞులు చెప్పటమే గాక, బ్రహ్మ స్వరూపమే గురుమూర్తిగా భావించటం వలన సాక్షాత్ సేవ చేసుకొను భావములో మనస్సు త్వరగా మోక్షమును పొందగలదు.

– సశేషం

విష్ణు  కథలు

-రమణ ప్రసాద్

# 3.తులసీదాసు



హస్తినాపురములో ఆత్మారాముడను బ్రాహ్మణునికి వాల్మీకి అంశతో ఒక పుత్రుడు జన్మించాడు. అతడికి “తులసీదాస్” అని నామకరణం చేశారు. ఆ సమయంలో ఆ దేశాన్ని అక్బరు పాదుషా పాలిస్తున్నాడు. అక్బరు చక్రవర్తి ఆత్మారాముని తన మంత్రిగా నియమించాడు. ఆత్మారాముడు రాచకార్యములను నిర్వహిస్తూ తక్కిన సమయములో తత్వవిషయములను వినిపిస్తూ ఉండేవాడు. తులసీదాసుకు 16 ఏళ్ళ వయస్సు వచ్చేసరికి వేదశాస్త్ర పురాణాలలో నిష్ణాతుడయ్యాడు. ఒక శుభముహూర్తంలో మేనమామ కూతురైన మమతాదేవినిచ్చి వివాహం చేశారు. మమతాదేవి సద్గుణవతి, సౌందర్యవతి. ఆత్మారాముడు తులసీదాసుని తన వెంట రాజసభకు తీసుకొని పోయి రాజనీతిని గురించి బోధించేవాడు. మంత్రి చేసే పనులన్నీ తన కుమారునికి నేర్పాడు.

ఒకనాడు ఆత్మారాముడు తీర్థయాత్రలు చేయదలచి, తన స్థానములో కుమారుని నియమించి, సాధు సంఘంతో బయల్దేరి వెళ్ళాడు. తులసీదాసు రాజవిధులను సక్రమంగా నిర్వహిస్తున్నాడు.

భగవన్మాయచేత తులసీదాసుకు దుస్సహవాసము కలిగి విషయలోలుడై, నిరంతరము వేశ్యల గృహంలో ఉంటున్నాడు. తల్లి ఎన్ని విధాలుగా నచ్చచెప్పినా ఇంటికి రాలేదు. ఆత్మారాముడు కూడ పరస్త్రీ గమనం మహా పాతకమని బోధించాడు. “నీవు సకల శాస్త్రములనభ్యసించియు అవివేకము చే పరవనిత మీద భ్రాంతి కలిగి మోహ ప్రవాహంలో పడిపోతున్నావు.

"కుమారా! నేటినుండి నీ భార్యను తప్ప పరస్త్రీలను కలనైన తలపకు" అని హితబోధ చేసి, ఆత్మారాముడు తన కుమారుని, కోడలి భారాన్ని భార్య రత్నాంబ పై వేసి తపస్సు చేయటానికి నైమిశారణ్యానికి వెళ్ళాడు.

తులసీదాసు భగవన్మాయ చేత తన భార్యపై మిక్కిలి మోహము కలిగి నిమిషమైన వదలక ఎవ్వరికి దర్శనం ఈయక విషయానందమే బ్రహ్మానందము అని నిర్ణయించుకొని కాలము గడుపుతున్నాడు. ఢిల్లీ నగరమున అక్బరు పాదుషా తన మంత్రి అయిన ఆత్మారాముడు వానప్రస్థమునకు వెడలిన వార్తవిని చింతించి తులసీదాసును చూడవలెనని అనుకొని కొందరు భటులచేత వార్త పంపాడు. తులసీదాసు పాదుషా దగ్గరకు వెళ్తే తిరిగి రావటానికి కొంత కాలము పడుతుందని గ్రహించి భార్యావియోగం సహించలేక నాకు అత్యవసరమైన పని ఉంది, నేను రావటానికి వీలుపడదని ప్రభువుకు చెప్పు"మని భటులను పంపించేశాడు.

రత్నాబాయి తన కుమారుడు పాదుషా మాట నిరాకరించాడని తెలిసి "రాజుపిలిస్తే నీవు వెళ్ళక పోవటం ఏమీ బాగాలేదు. నెలనెలకి వెయ్యివరహాలను మనకు ఉపకారవేతనంగా ఇస్తున్నారు. ఆ దేశాధీశుని ఆజ్ఞ నిర్లక్ష్యము చేయరాదు" అని మందలించింది. మమతాదేవి కడకు వచ్చి 'ఓసీ నిర్భాగ్యురాలా! నీవు ఇప్పుడే బయల్దేరి పుట్టింటికి వెళ్ళమని" ఉత్తర్వు జారీచేసింది.

అత్తగారి ఉత్తరువుని భర్తకు తెలియజేసి గ్రామానికి ప్రయాణ మయింది. తులసీదాసు ఆమెను బ్రతిమాలి ప్రయాణము ఆపివేశాడు. ఇంతలో అక్బరు పాదుషా ఆఊరికి వచ్చి ఒక ఉద్యానవనం లో నిలచి తులసీ దాసుకు కబురు పంపాడు. భార్యను వదలి పాదుషా వెంట వెళ్ళవలసి వస్తుందని నాకు చాలా ముఖ్యమైన పని ఉంది రాజుగారిని దర్శించుటానికి వీలు కాదని చెప్పాడు. ఆ వార్త పాదుషా వారికి తెలియచేయగా "నేను అవశ్యం తులసీదాసును చూడాల"ని పట్టపుటేనుగుపై తులసీదాసు ఇంటికి వచ్చి కబురు పంపగా భార్య ఎడబాటును సహింపజాలని తులసీదాసు మేడమీద ఒక గదిలో దాగి ఉన్నాడు. రత్నాబాయికి ఆవిషయము తెలిసి 'రాజాధిరాజు గుమ్మం వద్దకు వస్తే ఇంట్లో దాక్కొంటావా బయటకు రా' అని కోపంతో పలికి మమతాదేవితో "ఓ మాయలాడి! వానిని ఈ స్థితికి తెచ్చింది నువ్వే, కాబట్టి నువ్వు పుట్టింటికి తక్షణం బయల్దేరి వెళ్ళు" అని కోపంతో అంది. మమతాదేవి భర్తతో "నువ్వు పాదుషా వద్దకు పోయి మాట్లాడు లేకపోతే నేను ప్రాణ త్యాగం చేస్తాను"

అన్నది. అతను బయటకు వచ్చి పాదుషాను దర్శించాడు. పాదుషా మిక్కిలి సంతోషించి ఆలింగనము చేసుకొని అతనిని తన వెంట తీసుకొని ఢిల్లీకి బయల్దేరాడు. మమతాదేవి అత్తగారైన రత్నాబాయికి నమస్కరించి పుట్టింటికి వెళ్ళిపోయింది.

తులసీదాసు తన ప్రియసఖిని తలచుకొని దుఃఖిస్తూ భార్యావియోగము భరించలేక పాదుషా వారి అనుమతితో ఇంటికి వచ్చి భార్య పుట్టింటికి వెళ్ళిందని తెలిసి ఆగ్రామమునకు బయల్దేరాడు. ఆరోజు తులసీదాసు కామోపభోగము త్యజించటానికి అంతిమదినము. భవసాగరాన్ని తరించి బ్రహ్మానందములో ఓలలాడుటకు ప్రథమదినము.

భగవన్మాయచేత పెద్ద గాలివాన ప్రారంభమై ఉరుములు మెరుపులతో కుంభవృష్టి కురుస్తున్నా తులసీదాసు లెక్కచేయకుండా సాయంత్రానికి యమునానది తీరానికి చేరాడు. నదిని దాటించటానికి పడవ వాడు లేడు. పరవళ్ళుతొక్కుతున్న నదీప్రవాహంలో కొట్టుకువచ్చిన పీనుగును దుంగగా భ్రమించి గట్టిగా పట్టుకొని కొంతదూరం ఈది రాత్రివేళకు మామగారి ఇల్లు చేరి తులుపులు బాదాడు. గాలివాన హోరుకు వారికి వినపడక తలుపులు తీయలేదు.

-సశేషం

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ ప్రియతమ భక్తులు, అమెరికా వాస్తవ్యులు అయిన డా॥వల్లభజ్యోత్సుల భగవాన్ దాస్‌గారు కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇటీవల ఆశ్రమ నిసానికి విచ్చేశారు. వీరు 4-4-2012 బుధవారం శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 61 సంవత్సరాలు. వీరికి భార్య, ఒక కుమార్తె, అల్లుడు, మనుమడు కలరు. సద్గురుదేవులు వీరికి ఆత్మ శాంతిని ప్రసాదెంచదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL